


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | గురువారం | 10-09-2026 | సంపుటి: 3 | సంచిక: 218 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 10-09-2026 | VOLUME : 3 | ISSUE : 218 | PAGES: 8 | COST: 2/- |

## పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు

- కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ
- వెయ్యి రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం
- మా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారు
- దాడిపై గవర్నర్‌కు ఆధారాలు చూపాం: కేటీఆర్



3

## బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక వైఖరి

- ఇద్దరు మండలి సభ్యులు స్పీకర్‌ను అవమానించారు
- బీఆర్ఎస్ దుశ్చర్యలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు కాంగ్రెస్ సభ్యుల వినతిపత్రం



2







# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీష్ రావు సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- ఆమోదించిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్

**హైదారాబాద్, సెప్టెంబర్ 9:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా వారు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న ఈ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి,

మిగతా 2వ పేజీలో..

## సభాపతిని, దళితులను అవమానిస్తే సహించం

- కుట్రదారులపై అట్రాసిటీ కేసులతో కఠిన చర్యలు
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక



2

## స్పీకర్‌ను శాసించే హక్కు ఎవరికీ లేదు

- మీ బెదిరింపులకు ఎవరూ భయపడరు
- శుద్ధి కార్యక్రమాల ద్వారా దళితులను అవమానించారు
- ప్రతిపక్షంపై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్



2

## కాళోజీ సేవలను స్మరించుకోవాలి



- కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా సీఎం శుభాకాంక్షలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :** తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు

మిగతా 2వ పేజీలో..

గడీల పాలనపై గర్జించిన ధీర వనిత ఐలమ్మ 2

## ఇది బీఆర్ఎస్‌పై సస్పెన్షన్ కాదు..

- ప్రజా సమస్యలపై కాంగ్రెస్ విధించిన సస్పెన్షన్
- నియంతృత్వంతో ప్రజాస్వామ్యాన్ని అణచలేరు
- బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :** అసెంబ్లీ సమావేశాలు అంటే ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం కాదు.. ప్రజల సమస్యలపై చర్చ జరగాలి.. వాటికి పరిష్కారం చూపాలి అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు అన్నారు. మూడు రోజులుగా అసెంబ్లీ సమావేశాలను ప్రజలు చూస్తున్నారు.. ప్రజలు ఎదుర్కొంటున్న ఒక్క సమస్యపైనైనా చర్చ జరిగిందా.. ఒక్క ప్రభుత్వ విధానంపైనైనా సమాధానం చెప్పారా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాన్ని వేధించడం, గొంతు నొక్కడం, బయటకు పంపించడం తప్ప ప్రజల సమస్యలపై ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. అసెంబ్లీలో

మిగతా 2వ పేజీలో..

## స్టైఫండ్ డబుల్

- ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్
- స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ
- మంత్రి దామోదర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్



2

## అసెంబ్లీ సాక్షిగా డ్రామాలాడుతున్నారు

- వైఫల్యాలు, అవినీతి కప్పి పుచ్చుకునేందుకే ఇరు పార్టీల నాటకాలు
- ఎమర్జెన్సీ చీకటి రోజులను తలపిస్తున్న రేవంత్ రెడ్డి పాలన
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై డాక్టర్ లక్ష్మణ్ ఫైర్



3

## ఇన్సూరెన్స్ పేరుతో కోట్లలో బురిడీ

- ఆఫర్ల పేరిట ఆగడాలు
- రాత్రికి రాత్రే బోర్డులు తిప్పేయడం
- ఐఆర్ డీఏఐ లైసెన్స్ లేకుండా 20 మందితో నెట్ వర్క్
- బాధితుల్లో రైతులు, కూలీలు, పోలీసులు కూడా
- విచారణ జరపాలని బాధితుల డిమాండ్




3



## కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి
- రవీంద్రభారతిలో కాళోజీ జయంతి ఉత్సవాలు
- వి.ఆర్.విద్యార్థికి కాళోజీ సాహిత్య పురస్కారం ప్రదానం

3

రాజముద్ర తెలుగు దిన పత్రిక www.rajamudranews.com

# కాళోజీ సేవలను స్మరించుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**

సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి సేవలను మనమంతా స్మరించుకోవాలన్నారు. కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పుష్పాంజలి ఘటించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రజా ప్రభుత్వం సారథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భాషకు కాళోజీ చేసిన సేవలు శ్లాఘనీయమని, ఆయన స్ఫూర్తితో తెలంగాణ భాష, సాహిత్యానికి మరింత ప్రోత్సాహం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# గడీల పాలనపై గర్జించిన ధీర వనిత ఐలమ్మ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**

గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా ఆ మహనీయురాలు ఎగరేసిన ధిక్కార పతాకం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి (10వ తేదీ) సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తు చేశారు. సమ్మక్కసారక్క, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని తెలిపారు. వారి ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# ఇది బీఆర్ఎస్‌పై సస్పెన్షన్ కాదు..

**మొదటిపేజీ తరువాయి**



ప్రజా సమస్యలు చర్చకు రాకుండా తమను బలవంతంగా బయటకు పంపించడం అప్రజాస్వామికం అని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు వస్తున్నాయని తెలిసి తమ సమస్యపై అసెంబ్లీలో మాట్లాడండి అంటూ ఎన్నో వర్గాల ప్రజలు తమకు వినతిపత్రాలు ఇచ్చారు.. వారు ఎంతో ఆశగా ఫోన్లు చేస్తున్నారు.. మెసేజులు పెడుతున్నారు.. మా గొంతును అసెంబ్లీలో వినిపించండి అని ప్రజలు అడుగుతుంటే తాము బాధపడటం తప్ప ఏం చేయాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ఎప్పుడు పూర్తి చేస్తారని ఆర్టీసీ ఉద్యోగులు, నిషేధిత జాబితా నుంచి తమ భూములను ఎప్పుడు తొలగిస్తారని భూయజమానులు అడుగుతున్నారు.. తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న జీవో 97ను ఎప్పుడు రద్దు చేస్తారని పాలిటెక్నిక్ విద్యార్థులు అడుగుతున్నారు.. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.. డీఏ, పీఆర్సీ కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.. కారుణ్య నియామకాల కోసం సింగరేణి ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.. పింఛన్ల పెంపు కోసం అవ్వాతాతలు ఎదురుచూస్తున్నారు.. ఇవన్నీ అసెంబ్లీలో చర్చకు వస్తాయనే భయంతోనే ప్రభుత్వం ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపింది అని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిలదీసే బీఆరఎస్ గొంతును సస్పెన్షన్ పేరుతో నొక్కాలని చూస్తున్నారన్నారు. కానీ రేవంత్ రెడ్డీ.. గుర్తుంచుకోండి.. ఇది ప్రతిపక్షంపై విధించిన సస్పెన్షన్ కాదు.. ఇది ప్రజా సమస్యలపై, ప్రజల గొంతుపై విధించిన సస్పెన్షన్ అని అన్నారు. మైకులు కట్ చేసో.. సస్పెన్షన్ విధించో అసెంబ్లీలో మా గొంతును అణచి వేయవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో చేయలేరు అని వ్యాఖ్యానించారు. ఎంత అణచివేస్తే అంత బలంగా ప్రజల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని, నియంతృత్వంతో ప్రజాస్వామ్యాన్ని ఎక్కువ కాలం అణచివేయలేరని అన్నారు. హిట్లర్ తనకు ఆదర్శమని చెప్పుకున్న రేవంత్ రెడ్డి.. హిట్లర్ తరహా నియంతృత్వ ధోరణులతో పాలన సాగిస్తే చరిత్ర ఇచ్చే తీర్పు నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. కేసీఆర్ పట్ల మీరు చేసిన అవమానాలు, వ్యక్తిగత దూషణలు, రాజకీయ కక్ష సాధింపులను సమాజం గమనిస్తోందని, ప్రజలే అంతిమ న్యాయమూర్తులు.. ప్రజలే మీకు తగిన గుణపాఠం చెబుతారు అని అన్నారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే వరకు బీఆర్ఎస్ వెనక్కి తగ్గదు.. నియంతృత్వం ఎంత పెరిగితే ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుందన్న విషయం గుర్తుంచుకోండి అని హరీష్‌రావు హెచ్చరించారు.

# బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక వైఖరి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**

బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు తాతా మధు, నవీన్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా శాసనసభ స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేశారని, మరణించిన ఆయన తల్లిని ఉద్దేశించి అనుచిత పదజాలం ఉపయోగించడం ద్వారా స్పీకర్‌ను తీవ్రంగా బాధించారని శాసనసభ, శాసనమండలిలోని కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇది మొత్తం దళిత సమాజాన్ని రాష్ట్రంతోపాటు దేశంలోని మహిళలందరినీ అవమానించినట్లయిందని గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షకుడిగా అత్యున్నత హోదాలో ఉన్న గవర్నర్ జోక్యం చేసుకుని శాసనసభ ప్రాంగణంలోనూ, వెలుపలనూ దళితులు, మహిళల గౌరవం, భద్రత, ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. ఈనెల 8న జరిగిన ఘటనలు మన చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతాయన్నారు. శాసనసభ ప్రధాన ద్వారం వెలుపల మీడియా కెమెరాల సమక్షంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు తొలుత తన చొక్కాను విప్పారని, అనంతరం పలువురు ఇతరులు కూడా అదేవిధంగా చేసి పోలీసు సిబ్బందిపై చొక్కాలను విసిరారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా విధుల్లో ఉన్న మహిళా పోలీసు సిబ్బంది వైపు దూసుకెళ్లి వారిని తాకుతూ, అత్యంత అభ్యంతరకరంగా దగ్గరగా వెళ్లారన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ నేతృత్వంలో పలువురు నాయకులు పోలీసు సిబ్బందిపై, మహిళా పోలీసు అధికారుల పైనా భౌతికంగా దాడి చేశారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. దళిత సమాజానికి చెందిన సభ్యులు శాంతియుతంగా, చట్టబద్ధంగా ఎర్రవల్లి వైపు ర్యాలీగా వెళ్లి బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు క్షమాపణ చెప్పాలని కోరిన నేపథ్యంలో కూడా బీఆర్ఎస్ అత్యంత దారుణమైన చర్యలకు పాల్పడిందని వారు ఆరోపించారు. దళిత సోదరులు, సోదరీమణులు నడిచిన రహదారులను పసుపు నీరు, పాలు చల్లి శుద్ధి చేయడం ద్వారా నిషేధిత, చట్టవిరుద్ధమైన, అమానవీయమైన, అనైతికమైన అంటరాని తన ఆచరణను బీఆర్ఎస్ ప్రదర్శించిందని పేర్కొన్నారు. ఈ మధ్యయుగ, భూస్వామ్య మనస్తత్వాన్ని ప్రతిబింబించే చర్యలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సైతం బీఆర్ఎస్ నేతలు గర్వంగా ప్రచారం చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంటరానితనం సాధారణంగా ఉన్న చీకటి యుగంలోకి తెలంగాణతోపాటు భారత దేశాన్ని కూడా తిరిగి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. దళిత సమాజానికి వారి పదేళ్ల పాలనలో చేసిన ద్రోహాన్ని కాంగ్రెస్ నాయకులు వినతిపత్రంలో వివరించారు. దళిత ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీని విస్మరించడం, దళిత సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్యను అనూహ్యంగా పదవి నుంచి తొలగించడం, మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తామన్న హామీని విస్మరించడం, దళిత బంధు పథకాన్ని ఎన్నికల స్టంట్‌గా మార్చడం, అలాగే ఎస్సీ సబ్ ప్లాన్‌కు సంబంధించిన రూ.1,296 కోట్ల నిధులను ఖర్చు చేయకుండా మిగిల్చడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు. ఈ ఘటనలకు ప్రత్యక్షంగా పాల్పడిన వారిపైనే కాక బీఆర్ఎస్ అగ్ర నాయకత్వంలో ఉన్న అసలు కుట్రదారులపై కూడా అత్యంత కఠినమైన శిక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలని వారు గవర్నర్‌ను కోరారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**మొదటిపేజీ తరువాయి**

సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే వి వాంట్ జస్టిస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మ గౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితోపాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేసి అవమానించడమే కాక న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేదలకు న్యాయం జరగాలన్నారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి రాష్ట్రం సిద్ధంగా లేదని భట్టి ఘాటుగా అన్నారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు**

మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారన్న ఘటనపై కేటీఆర్, హరీష్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద సోమవారం జరిగిన ఘటనపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో 74, 75(1), 79, 121(1), 130, 132, 296, 351(2), 352 తీ/• 3(5) సెక్షన్ల కింద బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారని ఫిర్యాదులో బాధిత పోలీసు సిబ్బంది వెల్లడించారు. మహిళా పోలీసులనుద్దేశించి బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. మహిళా పోలీసులు అని చూడకుండా తమ ఎదుట టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తించకుండా అడ్డుకుని బెదిరించినట్లు వివరించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులు పరిశీలించాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రవర్తన దురుసుగా ఉందని తెలిపారు. మహిళా పోలీసులను నెట్టడంతో ఇబ్బంది కలిగించారని ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో తమకు తీవ్ర మానసిక వేదన, అవమానం కలిగిందని తెలిపారు. ఘటన అనంతరం మహిళా పోలీసులకు హాస్పిటల్‌లో వైద్య చికిత్సలు చేసినట్లు వివరించారు.

# సభాపతిని, దళితులను అవమానిస్తే సహించం

- **అంటరానితనం, దొర అహంకారం పేరుకుపోయాయి**
- **ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర**
- **బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు**
- **స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు**
- **కుట్రదారులపై అట్రాసిటీ కేసులతో కఠిన చర్యలు**
- **అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:**

శాసనసభలో సభాపతి స్థానాన్ని, దళిత వర్గాలను అవమానించేలా బీఆర్ ఎస్ నాయకులు వ్యవహరించడం అత్యంత హేయమైన చర్య అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. శాసనసభలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన ప్రతిపక్ష నేత కేసీఆర్, బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా రంగంలో అక్రమాలు, ధరణి సమస్యలు, 22ఎ వివాదంపై సభలో చర్చ జరగాల్సి ఉందని సీఎం పేర్కొన్నారు. అయితే పదేళ్ల పాలనలో జరిగిన దురాగతాలు, చేసిన అప్పుల వివరాలు ప్రజలకు తెలుస్తాయనే భయంతోనే ఫామ్‌హౌస్‌లో కుట్రలు పన్ని తమ సభ్యులతో సభను అడ్డుకున్నారని ఆరోపించారు. సభాపతి స్థానాన్ని, వారి తల్లిని కూడా అవమానించేలా వ్యవహరించడం ఉన్మాద చర్య అని సీఎం అభివర్ణించారు.

**దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడమా?**

ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లను కల్పించింది కాంగ్రెస్ పార్టీ.. ఇది కాంగ్రెస్ విధానం అని తెలిపారు. కర్ణాటకలో ఒక చిన్న గ్రామంలో పుట్టి రజాకార్ల దాడులలో తండ్రిని కోల్పోయి కార్మిక నాయకుడిగా రాణించి జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే.. 60 ఏళ్లుగా ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారు.. ఉత్తరాఖండ్ లో ఒక మైదానంలో జరిగిన సభలో ఆయన పాల్గొంటే ఆగస్టు 10న బీజేపీ అనుబంధ సంస్థ ఆ మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం హేయమైన చర్య.. దీన్ని ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది.. పార్లమెంట్ సభ్యులు రాష్ట్రపతిని కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారని సీఎం తెలిపారు. ఇదిలా ఉండగానే రాష్ట్రంలో మరో దురదృష్టకర సంఘటన జరిగింది.. ఉన్మాదానికి లోనై ఉసిగొల్పబడిన కొంతమంది ముష్కరులు అధికారులపై దాడులు చేయడమే కాక సభాపతి కుర్చీని అవమానించేలా వ్యవహరించారు.. వ్యక్తినే కాక ఆయన తల్లిని కూడా అవమానించారు మహిళలను శక్తిగా కొలిచే సమాజం మనది.. భారత దేశాన్ని భారత మాత అని, తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావిస్తున్నాం.. సభాపతిగా ఉన్న మీ మనసుకు గాయం చేయాలని ఉన్మాదంతో మాట్లాడారు.. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభాపతికి క్షమాపణ చెప్పి వారి సభ్యులతో క్షమాపణ చెప్పించి సభ సజావుగా జరిగేలా చూస్తారని అంతా భావించారు.. కానీ అలా జరగకపోగా మరింత ఉన్మాదంతో వ్యవహరించారు.. అందుకే ఏ ఫామ్ హౌస్‌లో కుట్ర జరిగిందో ఆ ఫామ్ హౌస్ ముందు దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారు.. వాళ్లలా ఉన్మాదానికి తెగబడలేదు.. కేవలం డప్పు దరువులతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపారు.. ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన దళిత సోదరులను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా అవమానించారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించడం దొర అహంకారానికి, అంటరానితనానికి నిదర్శనం అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా బాధలో ఉన్నవారి సమస్యను పరిష్కరించే బాధ్యత వారిపై ఉంది.. ఆ ప్రతినిధులను లోపలికి పిలిచి మాట్లాడి జరిగిన సంఘటనపై కేసీఆర్ బాధ్యతతో వ్యవహరించాల్సి ఉండే కానీ అలా వ్యవహరించకుండా ఉన్మాదంతో వ్యవహరించారు.. దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించి తీవ్రంగా అవమానించారు.. అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది దళితులు నడిచిన నేలను కాదు.. మీ మనసుల్లో పేరుకుపోయిన అహంకారాన్ని, మనువాద ఆలోచనలను అని హితవు పలికారు. మల్లికార్జున ఖర్గే, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లకు జరిగిన అవమానం మొత్తం తెలంగాణ సమాజానికి జరిగినట్లేనన్నారు. తీవ్రవాదులకు, ఉన్మాదంతో సభాపతిని అవమానించిన వారికి పెద్ద తేడా లేదు అని వ్యాఖ్యానించారు.

**క్రిమినల్ కేసులు.. కఠిన శిక్షలు ఖాయం**

సభాపతిని అవమానించిన వారిని, కుట్రదారులను చట్టపరంగా తీవ్రంగా శిక్షిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 6న జరిగిన కుట్రతోపాటు తదనంతర ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులందరిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రకటించారు. చట్టాల సందుల నుంచి బెయిల్ పొందవచ్చేమో కానీ, తెలంగాణ సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని స్పష్టం చేశారు.

# స్పీకర్‌ను శాసించే హక్కు ఎవరికీ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**

శాసనసభలో ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చ అని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు పాలనలో ఉండి, మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవజ్ఞులు, ఉన్నత విద్యనభ్యసించిన వారు సభలో స్పీకర్‌ను శాసించేలా ప్రవర్తించడం సభ్య సమాజానికి, ప్రజలకు తీవ్ర అవమానకరమని స్పష్టం చేశారు. తమ స్థానాల్లో కూర్చొని ప్రజా సమస్యలపై వాదనలు వినిపించాల్సిందిపోయి దాడి చేస్తాం, భయపెడతాం అనే ధోరణితో వ్యవహరించడం ఎంతమాత్రం సరికాదని బీఆర్ఎస్ సభ్యులకు హితవు పలికారు. శాసనసభ నడుస్తున్న తీరును దేశమంతా గమనిస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. వేళ్లు చూపే బెదిరింపులకు సభలో ఎవరూ భయపడేది లేదని, ప్రజాస్వామ్యంపై జరిగే దాడులను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల, సభ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సభాపతి స్థానాన్ని మరింత అవమానించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తాము సహించేది లేదని స్పష్టం చేస్తూ స్పీకర్ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా వెన్నెముకలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. సభా నియమాలను గౌరవిస్తూ సభ్యులందరూ తమ స్థానాల్లో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చేసిన తప్పులకు పశ్చాత్తాపపడాల్సింది పోయి రహదారులపై పసుపు నీళ్లు చల్లి శుద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆ పార్టీ నాయకులు దళితులను అవమానించేలా వ్యవహరించారని మండిపడ్డారు. వందల ఏళ్ల సామాజిక సంస్కరణలతో పురోగమించిన నాగరిక తెలంగాణ సమాజాన్ని తిరిగి మధ్యయుగాల నాటి పరిస్థితికి తీసుకెళ్లడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకత్వ శుద్ధి కార్యక్రమంపై సభలో చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేశారు

**సభాపతితో వాగ్వాదానికి దిగడం తగదు**

బీఆర్ఎస్ సభ్యులు పదేపదే వెల్‌లోకి వచ్చి సభాపతితో వాగ్వాదానికి దిగడం, ఆయన సూచనలను పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. సభను సజావుగా నిర్వహించేందుకు సభ్యులందరూ సహకరించాలన్నారు. ఈ సభ, ఈ రాష్ట్రం ఆత్మగౌరవంపై ఏర్పడింది.. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నాలు మంచిది కాదు.. రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. బీఆరఎస్ సభ్యులు న్యాయం కోసం డిమాండ్ చేయడంపై భట్టి విక్రమార్క తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సభాపతిని అవమానించేలా వ్యవహరించిన అనంతరం ఇంకా ఏం న్యాయం కావాలని ప్రశ్నించారు. ఏం జస్టిస్ కావాలి? జస్టిస్ కావాల్సింది ఈ రాష్ట్రంలోని దళిత, బహుజన వర్గాలకు. జస్టిస్ కావాల్సింది గిరిజనులకు. మీ చేతుల్లో అవమానాలకు గురైన ప్రజలందరికీ జస్టిస్ కావాలి అని విక్రమార్క అన్నారు. దళితుల పట్ల గతంలో జరిగిన అవమానకర ఘటనలను ప్రస్తావిస్తూ ఆయన బీఆరఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. దళితులు నిరసన తెలిపిన ఘటనను కూడా ప్రస్తావిస్తూ సామాజిక న్యాయం విషయంలో ఎవరు ఎవరిని ప్రశ్నించాలో ఆలోచించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సహనం పాటిస్తోందని, అయినప్పటికీ సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగించడం సరికాదని అన్నారు. దొరతనపు పోకడలను ప్రజలు ఇక భరించడానికి సిద్ధంగా లేరని భట్టి విక్రమార్క అన్నారు. సభా గౌరవాన్ని కాపాడటంతోపాటు సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**కేసీఆర్ నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలి : భట్టి**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు సేవలు అందించాలని తాము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనసభలో బుధవారం సభ్యుల ఆందోళనల నేపథ్యంలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి సభ్యులు సంయమనం పాటించి తమ స్థానాల్లో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రభుత్వం గానీ, ఈ సభ్యులు గానీ, ఈ సభ గానీ కేసీఆర్ చావును కోరుకోవడం లేదు.. ఆయన నిండుగా నూరేళ్లు జీవించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ రాష్ట్రానికి ప్రతిపక్ష నాయకుడిగా సేవలు అందించాలని బలంగా కోరుకుంటున్నామని స్పష్టం చేశారు.

# స్టైఫండ్ డబుల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**

ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ రూ.34,385 నుంచి రూ.74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీవో కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

**'ఆయుష్'కు మరింత ఆదరణ పెరగాలి : మంత్రి దామోదర్**

ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి వైద్యులుగా ఎదిగి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని సూచించారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజంలో గుణాత్మక మార్పుకు పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతానికి ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియో, యునాని విభాగాల్లో 138మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్దిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేసి ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్లతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఆయుష్ హాస్పిటల్స్, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. 'మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి.. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది' అని మంత్రి రాజనర్సింహ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

# పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబర్ 9:
లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేం నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం.. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం అని చెప్పారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ వెయ్యి రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

**అవి ఏఐ ఫొటోలు ..**
**వాటిని వాడిన వారిపై చట్టపరంగా చర్యలు**

కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన ఫొటోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా రూపొందించిన నకిలీ చిత్రాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తమ నేతలపై అసత్య ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సోషల్ మీడియా హ్యాండిల్స్ ఏఐ రూపొందించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను ఉపయోగిస్తున్నాయని ఆరోపించారు. ఈ నకిలీ ఫొటోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని, వాటిని రూపొందించిన, ప్రచారం చేసిన వ్యక్తులతోపాటు వాటిని ఉద్దేశపూర్వకంగా ప్రసారం చేసిన మీడియా సంస్థలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను నిజమైనవిగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను బీఆర్ఎస్ సహించబోదని స్పష్టం చేశారు. ఎలాంటి దాడులు జరగకపోయినా దాడులు జరిగినట్లుగా నకిలీ చిత్రాలు, కల్పిత కథనాలతో ప్రచారం చేయడం ద్వారా అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ అన్నారు. దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్లు కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఇలాంటి దుష్ప్రచారంలో మీడియా సంస్థలు భాగస్వాములు కావొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఫేక్ ఫొటోలు, వీడియోలను ధ్రువీకరణ లేకుండా ప్రచురించవద్దని మీడియా సంస్థలకు సూచించారు. బీఆర్ఎస్ నేతల ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో నకిలీ కంటెంట్‌ను రూపొందించినా, ప్రచారం చేసినా, ప్రసారం చేసినా సంబంధిత వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఇన్సూరెన్స్ పేరుతో కోట్లలో బురిడీ

మహబూబ్ నగర్, సెంప్టెంబర్ 9 :
ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులమని, తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికి అమాయక ప్రజల నుండి రూ.కోట్లలో వసూలు చేస్తూ నిలువునా ముంచుతున్న ఒక దందా వ్యవహారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. గత పదేళ్లుగా కంపెనీల పేర్లు, ఆఫీసుల చిరునామాలు మారుస్తూ ఒక ముఠా పద్ధతి ప్రకారం మోసాలకు పాల్పడుతున్నట్లు బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పదేళ్ల క్రితం 'ఐఐఎఫ్ఎల్ గోల్డ్ ఇన్సూరెన్స్ లైఫ్' పేరుతో జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆఫీస్ ఏర్పాటు చేసి భారీగా డిపాజిట్లు, పాలసీలు కట్టించుకుని మోసం చేశారు. అప్పట్లో పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు, గొడవలు జరగడం సంచలనం సృష్టించింది. ఆ రగడ సద్దుమణగగానే అదే బృందం రూపం మార్చి 'ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్' పేరుతో మళ్లీ కార్యకలాపాలు మొదలుపెట్టింది. 5 సంవత్సరాలు చెల్లిస్తే చాలు.. 10 సంవత్సరాల పూర్తి బెనిఫిట్స్ వస్తాయి అని చదువురాని అమాయకులు, కూలీలు, రైతులను టార్గెట్ చేసి పాలసీలు కట్టించుకున్నారు. తీరా కొన్ని ఏళ్ల తర్వాత బాధితులు తమ పాలసీల స్థితి తెలుసుకోవడానికి పాత బస్టాండ్ సమీపంలోని 'కోటా కాంప్లెక్స్' ఆఫీస్‌కు వెళ్తే రాత్రికి రాత్రే ఆఫీసు ఖాళీ చేసి పారిపోయారు. ఫోన్ నంబర్లు కూడా మార్చేయడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆ తర్వాత విచారిస్తే తమ డబ్బులు హెచ్‌డీఎఫ్‌సీ కి వెళ్లాయని కొందరు చెబితే అక్కడికి వెళ్లి అడిగితే ఈ బాండ్లకు, మాకు ఎలాంటి సంబంధం లేదు అని ఆ సంస్థ చేతులెత్తేసింది. ఈ నిర్వాహకులు ఇప్పుడు మరో కొత్త రూపమెత్తినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సెంట్రల్ బ్యాంక్, ఫ్యూచర్ జెనరలి, అర్బన్ మనీ ఇన్సూరెన్స్ పేర్లు వాడుకుంటూ మహబూబ్ నగర్ లోని ఎర్ర సత్యం చౌరస్తా సమీపంలోని ఒక భవనంలో ఎలాంటి బయటి బోర్డు లేకుండా ఆఫీస్ నడుపుతున్నారు. పెట్రోల్ బంకులు, రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లు, ప్రముఖ ఆలయాల వద్ద ఫ్రీ టోకెన్లు పంపిణీ చేసి, ఆ తర్వాత ఫోన్లు చేసి మీకు లక్కీ డ్రాలో గిఫ్ట్ తగిలింది, ఆఫీసుకు రండి అని పిలిపిస్తున్నారు. ఆఫీసుకు రాగానే మాటల గారడీతో నమ్మించి బలవంతంగా కొత్త పాలసీలు చేయిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. బాధితులు అందించిన సమాచారం ప్రకారం.. ఈ కార్యాలయంలో మేనేజర్ సుదర్శన్, ఆఫ్రీన్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రధాన సూత్రధారులుగా ఒక టీమ్‌గా ఏర్పడ్డారు. ఇన్సూరెన్స్ నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం అధికారిక ఏజెంట్ కోడ్ కానీ, అర్హత పత్రాలు కానీ లేని దాదాపు 20మంది యువతీ యువకులను వీరు నియమించుకున్నారు. వారికి నెలకు ₹10,000 జీతంగా ఇస్తూ వారి ద్వారా ఉచిత కూపన్ల వల విసిరి అమాయక ప్రజలను కార్యాలయానికి పిలిపించి పాలసీల పేరిట సొమ్ము వసూలు చేయిస్తున్నారని సమాచారం. ఈ మాయమాటలు నమ్మి మోసపోయిన వారిలో నవాబ్‌పేటకు చెందిన నిరుపేద టైలర్ మహమ్మద్ సుభాన్, శివ అనే వ్యక్తులతో పాటు స్వయంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పలువురు పీసీలు కూడా ఉన్నట్లు బాధితులు తెలుపుతున్నారు. ఈ ఆరోపణలపై ప్రస్తుతం ఎర్ర సత్యం చౌరస్తాలోని 'అర్బన్ మనీ ప్రైవేట్ లిమిటెడ్' మహబూబ్ నగర్ బ్రాంచ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న సుదర్శన్ ను 'ప్రజాతంత్ర' వివరణ కోరగా పలు విషయాలు వెల్లడించారు. కూపన్ల క్యాంపెయిన్ నిజమే. ఇన్సూరెన్స్ వ్యాపారం పెంచుకునేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తాం, అందులో భాగంగానే దేవాలయాలు, మార్కెట్ల వద్ద ఉచిత కూపన్ల పేరిట క్యాంపెయిన్ నిర్వహించాం అని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కూపన్ల ద్వారా పిలిపించి పాలసీలు చేయడంపై ప్రశ్నించగా వ్యాపారం కోసం మా ప్రయత్నాలు మేము చేస్తాం అని పేర్కొన్నారు. అర్బన్ మనీ ఆఫీస్‌కు బయట కనీసం బోర్డు కూడా లేకుండా ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించగా పై అధికారుల నుంచి బోర్డు పెట్టమని ఆదేశాలు రాలేదు.. అందుకే పెట్టలేదు అని చెప్పారు. తమ వల్ల కొందరికి మంచి కూడా జరిగిందని అన్నారు. ఎలాంటి బోర్డులు లేకుండా, ఐఆర్‌డీఏఐ నిబంధనలను పక్కనబెట్టి అనాధికారిక వ్యక్తులతో ఇన్సూరెన్స్ వ్యాపారం నడుపుతున్న ఈ కార్యాలయంపై జిల్లా ఎస్పీ, విజిలెన్స్ అధికారులు, సైబర్ క్రైమ్ పోలీసులు తక్షణమే సుమోటోగా స్పందించి సమగ్ర విచారణ జరపాలని, బాధితుల కష్టార్జితానికి న్యాయం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ వీధి నాటకాలు

- **అసెంబ్లీలో ప్రజల పక్షాన నిలిచింది బీజేపీ మాత్రమే**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 9 :
శాసనసభ, శాసనమండలి వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు రోజులుగా ఆడుతున్న కపట నాటకాలను యావత్ సమాజం అసహ్యించుకుంటోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. చట్టసభల సమావేశాలు ప్రారంభమవుతున్నాయంటే తమ బతుకులు మారేలా ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుందని వివిధ వర్గాల ప్రజానీకం ఆశగా ఎదురుచూస్తారన్నారు. వారి ఆశలను వమ్ము చేస్తూ అసెంబ్లీని ఈ రెండు పార్టీలు తమ వ్యక్తిగత దూషణలకు, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం బీజేపీ శాసనసభాపక్షానికి, పార్టీ ఎమ్మెల్యేలకు రాష్ట్రవ్యాప్తంగా నిత్యం వేలాదిగా ప్రజా సమస్యల అర్జీలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. లక్షలాదిమంది నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన రూ.50వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వివాదాస్పద 22ఎ భూముల జాబితా అంశం, ఉద్యోగుల సమస్యలైన పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలుతోపాటు రాష్ట్ర ఆర్థిక, సామాజిక సంక్షోభాలపై సభలో చర్చించాల్సిన అత్యవసర పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని అరాచకాల నుంచి విముక్తిని, మార్పును కోరుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ సర్కార్ కూడా ప్రజాద్రోహ విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక తీవ్ర సమస్యలకు మూలకారణం గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలేనని అన్నారు. తమ పాపాలు, వైఫల్యాలు, అసమర్థత బయటపడకుండా ఉండేందుకు ఇరు పార్టీలు అసెంబ్లీని పక్కదోవ పట్టిస్తున్నాయని రామచందర్‌రావు ఆరోపించారు. పరస్పర బూతుల తిట్ల పురాణంతో, కేవలం టీఆర్పీలు, కెమెరా పబ్లిసిటీ స్టంట్ల కోసమే సభా సమయాన్ని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వెల్‌లో బీజేపీ పక్షాన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 22ఎ నిషేధిత భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఇచ్చిన వాయిదా తీర్మానా



లు కూడా చర్చకు రాకుండా అడ్డుకున్నాయని విమర్శించారు. ఈ పార్టీలు తమ రాజకీయ స్వార్థాన్ని, నాటకాలను పక్కనపెట్టి మిగిలిన మూడు రోజుల సమావేశాలనైనా ప్రజా సమస్యలపై చర్చించేందుకు సద్వినియోగం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగుతుందంటూ కాంగ్రెస్‌బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని రామచందర్ హెచ్చరించారు.

# కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 9 :
కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుకగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన వి.ఆర్.విద్యార్థికి (వేలూరి రాములు) 2026 కాళోజీ నారాయణరావు సాహిత్య పురస్కారాన్ని ఆయన ప్రదానం చేశారు. కాళోజీ సాహిత్య వారసత్వాన్ని వి.ఆర్.విద్యార్థి వంటి వారు పుణికిపుచ్చుకుని ముందుకు తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కోరారు. తెలంగాణ ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆకాంక్ష, పోరాటం, ఆత్మగౌరవం కాళోజీ రచనల్లో స్పష్టంగా ప్రతిబింబించాయన్నారు. 'నా గొడవ' కేవలం ఆయన వ్యక్తిగత గొడవ కాదని, సమాజంలోని అణగారిన, బాధిత, సామాన్య ప్రజల గొడవను తన గొడవగా కాళోజీ స్వీకరించారని మంత్రి చెప్పారు. ప్రజల సమస్యలను తన కలంతో వినిపించిన ప్రజాకవిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

**నగరపర్యటనలను అన్వేషించండి**

**తెలంగాణ యాస.. కాళోజీ శ్వాస**

తెలంగాణ భాష, యాసపై కాళోజీకి ఉన్న ప్రగాఢ విశ్వాసం ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి జూపల్లి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రథమ మహాసభలో తెలంగాణ బతుకు, భాషపై కాళోజీ చేసిన అధ్యక్షోపన్యాసం తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రలో సువర్ణాధ్యాయమని అన్నారు.ప్రజలు మాట్లాడే భాషలోనే రచనలు చేయాలని కాళోజీ బలంగా విశ్వసించారని చెప్పారు.

**పలుకుబడుల భాషకు పెద్దపీట**

కాళోజీ దృష్టిలో భాషకు రెండు తీర్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఒకటి బడి పలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష అని వివరించారు. పుస్తకాల్లో, పండితుల రచనల్లో కనిపించే భాష కంటే ప్రజల నాలుకలపై సహజంగా నడయాడే పలుకుబడుల భాషలోనే నిజమైన జీవన వాస్తవికత ఉంటుందని కాళోజీ విశ్వసించారని చెప్పారు. తన పోరాటాలన్నింటికీ కాళోజీ కవిత్వాన్ని మాధ్యమంగా ఎంచుకున్నారని, చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, సరళంగా ప్రజల భాషలోనే చెప్పేవారని పేర్కొన్నారు. అందుకే ఆయన రచనలు సామాన్య ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. తెలంగాణ యాసను, భాషను, ప్రజల పలుకుబడిని కాళోజీ సాహిత్యంలో గౌరవప్రదంగా నిలబెట్టారని జూపల్లి అన్నారు. తెలంగాణ మాండలికాన్ని తక్కువగా చూసే ధోరణులకు తన కలంతో సమాధానం చెప్పి తెలంగాణ యాస పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని చాటుకున్నారని వెల్లడించారు. భాష సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదని, ఒక జాతి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతిబింబమని మంత్రి పేర్కొన్నారు. కాళోజీ అందించిన స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతోనే ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ కార్యాలయంలో కాళోజీ జయంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 9:
ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను డీజీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సాహిత్య సేవలను, ప్రజా సమస్యలపై తన రచనల ద్వారా కల్పించిన చైతన్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఐజీ గజరావు భూపాల్, మల్టీ జోన్ II ఐజీ షానవాజ్ ఖాసిం, ఏఐజి అడ్మిన్ జె.అన్యోన్య , టి జి స్పార్క్ ఎస్పీ రూపేష్, పేషీ డీఎస్పీ భాస్కర్, స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ, సీఎస్ఓ యోగేశ్వరరావు తోపాటు ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అసెంబ్లీ సాక్షిగా డ్రామాలాడుతున్నారు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:
శాసనసభలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వీధి నాటకాలకు తెరతీశాయని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి బట్టబయలు కాకుండా రెండు పార్టీలు కుమ్మక్కై 'దూప్ ఫైటింగ్' డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. బుధవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలులో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని లక్ష్మణ్ మండిపడ్డారు. రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పేద విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థగా మారిందని, ఎటువంటి విచారణ లేకుండా దాదాపు కోటి ఎకరాలను 22/A నిషేధిత జాబితాలో చేర్చి దందాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు సెటిల్మెంట్లు చేస్తూ ఆ డబ్బును ఢిల్లీకి కప్పంగా పంపుతున్నారని విమర్శించారు.

**నిరంకుశ పాలన..**

**రాజ్యాంగానికి అవమానం**

ప్రశ్నించే బీజేపీ నేతలను హౌస్ అరెస్టులు, అక్రమ కేసులతో అణచివేస్తున్న రేవంత్ పాలన.. ఇందిరమ్మ ఎమర్జెన్సీని, మమతా బెనర్జీ నిరంకుశత్వాన్ని తలపిస్తోందని విమర్శించారు. బాధ్యతగల ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం ప్రజాతీర్పును, రాజ్యాంగాన్ని అవమానించడమేనని దుయ్యబట్టారు.

**బహిరంగ చర్చకు సిద్ధం**

ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఈ ప్రాంతానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. పదేళ్ల మోదీ ప్రభుత్వమే తెలంగాణకు అత్యధికంగా నిధులు కేటాయించిందని స్పష్టం చేశారు. యూపీఏ హయాంలో రైల్వే బడ్జెట్ కింద కేవలం రూ. 886 కోట్లు ఇస్తే, మోదీ సర్కార్ రూ. 5,500 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. వందే భారత్ రైళ్లు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్, గిరిజన వర్సిటీ, రామగుండం ఎరువుల కర్మాగారం వంటివి కేంద్రం ఇచ్చిందేనని తెలిపారు. ఈ అంశాలపై అసెంబ్లీలోనైనా, బహిరంగ వేదికపైనైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాబోయే జమిలి ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు

# యూరియా యాప్‌ను రద్దు చేసే ప్రసక్తే లేదు

- **పారదర్శకత, రైతులకు సబ్సిడీ అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **రాష్ట్రం ఆదర్శంగా కేంద్రం తీసుకొచ్చిన ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్**
- **కౌలు రైతుల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**



హైదరాబాద్, సెప్టెంబర్ 9 :
పారదర్శకంగా రైతులకుసబ్సిడీ ఎరువులు అందించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్' ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తి లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితర సభ్యులు బుధవారం అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. యాప్ అమలులో ఉన్న సాంకేతిక సమస్యలను అధిగమించి రైతులకు మరింత సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గతంలో ఆధార్ ద్వారా ఎరువుల పంపిణీ జరిగేదని, అయితే వాస్తవంగా సాగు చేసే రైతులకే సబ్సిడీ ఎరువులు చేరాలన్న ఉద్దేశంతో ఈ యాప్‌ను తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. ఎరువుల అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్, పరిశ్రమలకు మళ్లింపు వంటి వాటికి చెక్ పెట్టి పారదర్శకతను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. యాప్ ద్వారా ఇప్పటివరకు 50 లక్షల మందికి పైగా రైతులు ఎరువులు కొనుగోలు చేశారని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

**కేంద్రమూ అమలు చేస్తున్నది**

తెలంగాణ ప్రభుత్వం రబీ 202526 లో తెచ్చిన యూరియా బుకింగ్ యాప్ విజయవంతం కావడంతో దీన్ని ఆదర్శంగా తీసుకున్న కేంద్రం దేశవ్యాప్తంగా 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్‌ను ప్రవేశపెట్టిందని మంత్రి తుమ్మల తెలిపారు. దీనిని రాష్ట్రవ్యాప్తంగా గత వారం నుంచే అమలు చేస్తున్నామన్నారు. ప్రారంభ దశలో ఉన్న కొన్ని సాంకేతిక సమస్యలను కేంద్ర సాంకేతిక బృందం సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సర్వర్ సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), మీసేవ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. గతంలో కమ్యూనికేషన్, రవాణా సదుపాయాలు లేని సమయంలో ప్రభుత్వం సొసైటీలకు రవాణా ఛార్జీలు భరించేదని, ఇప్పుడు ఆ పరిస్థితి మారడంతో ఆ విధానాన్ని ఉపసంహరించుకున్నామని మంత్రి చెప్పారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 12 వేల ఎరువుల విక్రయ కేంద్రాలు, డీలర్లు, సొసైటీల వద్ద ఒకే ధరకు యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. అలాగే కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

**కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలి**

కేంద్ర ప్రభుత్వం యూరియాపై ఎక్కువ సబ్సిడీ ఇస్తూ కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించకపోవడంతో రైతులు కేవలం యూరియా వైపు మొగ్గు చూపుతున్నారని తుమ్మల అన్నారు. దీని వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని, ఎరువుల ధరలను క్రమబద్ధీకరించాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినట్లు తెలిపారు. యుద్ధ పరిస్థితుల కారణంగా దిగుమతుల్లో కొంత ఆలస్యమైనా రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని, గతంలో 1617 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉంటే ఇప్పుడు వాటిని 2223 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని మంత్రి వివరించారు.

# 13 రకాల విత్‌డ్రాలు 3 కేటగిరీలు

- పీఎఫ్ అడ్వాన్స్ రూల్స్‌లో కీలక మార్పులు
- 75 శాతం బ్యాలెన్స్ విత్‌డ్రాకు అనుమతి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9 :**

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి వాటి స్థానంలో కేవలం మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసంహరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు. ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు.

# ఝార్ఖండ్ వోటర్ల జాబితాలో ఆఫ్ఘన్ జాతీయులు

- దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి

**జంషెడ్‌పూర్, సెప్టెంబర్ 9:**



ఝార్ఖండ్‌లో నిర్వహించిన వోటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన వోటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా వోటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధృవీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు. నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు సరైన భారతీయ పౌరసత్వ పత్రాలను సమర్పించలేకపోయారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులు లభించడంతో వారు విదేశీయులని నిర్ధారణ అయింది. ఝార్ఖండ్ సీఈవో కేజీ రవికుమార్ ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ విదేశీ పౌరుల పేర్లను వోటర్ల జాబితా నుండి తక్షణమే తొలగించినట్లు వెల్లడించారు. విదేశీ పౌరులకు భారతీయ వోటరు కార్డులు లభించేలా వెనుకుండి సహకరించిన వ్యక్తులు, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురి కుటుంబ సభ్యుల పత్రాలపై కూడా తనిఖీలు జరుపుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి విదేశీయుల పేర్లు నమోదయ్యాయా అన్న కోణంలో దర్యాప్తు వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

## బీజేపీ ఖజానాకు ఎన్నికల వేళ భారీ నిధుల వరద

- ఎన్నికల సమయంలో బీజేపీ బ్యాలెన్స్ రూ.904.6 కోట్లు పెరుగుదల
- అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరిలో రూ.159.7 కోట్ల ఖర్చు
- కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో రూ.248.55 కోట్లు వ్యయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:**

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ కేంద్ర ప్రధాన కార్యాలయానికి భారీగా విరాళాలు అందాయి. ఎన్నికల సంఘానికి పార్టీ సమర్పించిన ఖర్చుల నివేదిక ప్రకారం.. ఎన్నికల కాలంలో బీజేపీ కేంద్ర కార్యాలయానికి దాదాపు రూ.1,472.8 కోట్ల నిధులు సమకూరాయి. అదే సమయంలో కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర యూనిట్లకు కలిపి నికరంగా రూ.207.17 కోట్ల రాబడి వచ్చింది. దీంతో కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీకి వచ్చిన నిధులు ఏడు రెట్లకు పైగా ఉన్నట్లు లెక్కలు వెల్లడిస్తున్నాయి.

**బీజేపీ ఖర్చుల వివరాలు**

అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఇప్పటివరకు సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి వెచ్చించగా.. మిగిలిన మొత్తం అభ్యర్థులు, ఇతర వ్యయాలకు కేటాయించారు. అస్సాంలో అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చయ్యాయి. సాధారణ ప్రచారానికి రూ.76.73 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.19.54 కోట్లు వెచ్చించారు. ప్రకటనలకు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపైనర్ల ప్రయాణాలకు రూ.27.3 కోట్లు ఖర్చు చేశారు. పుదుచ్చేరిలో రూ.11.90 కోట్లు ఖర్చు చేయగా.. రూ.9.19 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.2.71 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించారు. తమిళనాడులో రూ.51.56 కోట్ల వ్యయం నమోదైంది. ఇందులో సాధారణ ప్రచారానికి రూ.44.51 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.7.05 కోట్లు ఖర్చు చేశారు. మీడియా ప్రకటనలకు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపైనర్ల ప్రయాణాలకు రూ.10.04 కోట్లు, ప్రచార సామగ్రికి రూ.5.85 కోట్లు వెచ్చించారు. కేరళ, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన బీజేపీ ఖర్చుల నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. దీంతో పార్టీ మొత్తం ఎన్నికల వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది.

**బ్యాలెన్స్‌లోనూ భారీ పెరుగుదల**

మార్చి 15 నాటికి బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాలో రూ.6,722.6 కోట్ల క్లోజింగ్ బ్యాలెన్స్ ఉంది. మే 6 నాటికి అది రూ.7,627.2 కోట్లకు చేరింది. అంటే ఎన్నికల సమయంలోనే పార్టీ ఖాతాలో రూ.904.6 కోట్ల మేర అదనపు నిధులు చేరాయి.

**కాంగ్రెస్ వ్యయం రూ.248.55 కోట్లు**

కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం మొత్తం రూ.248.55 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో సాధారణ ప్రచారానికి రూ.143 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.105.55 కోట్లు వెచ్చించింది. మార్చి 15 నుంచి మే 6 మధ్య పార్టీ నిధులు రూ.169.06 కోట్ల నుంచి రూ.103.2 కోట్లకు తగ్గాయి. దీంతో సుమారు రూ.65.86 కోట్ల లోటు నమోదైంది. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారం కోసం రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా.. రాష్ట్ర యూనిట్లు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి. కేరళలో వామపక్ష కూటమిని ఓడించి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో అత్యధికంగా రూ.59.28 కోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాత అసోంలో రూ.22.62 కోట్ల వ్యయం నమోదైంది.

# రూ.10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- రాష్ట్రంలో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- మీడియాకు వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 :**

రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం తెలంగాణలోని ఘట్‌కేసర్‌కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణంరేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029 30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మేజూన్ నాటికి టెస్టింగ్ కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్ పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్ కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్‌బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలంకరూర్‌దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్‌ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది.ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝార్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి.



ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులు ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

**ఘట్ కేసర్ – కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవున నాలుగో లైన్**

కాజీపేట/హైదరాబాద్, ప్రజాతంత్ర, సెప్టెంబర్ 9 : తెలంగాణలోని అత్యంత కీలకమైన ఘట్‌కేసర్ కాజీపేట సెక్షన్ మధ్య 110 కిలోమీటర్ల పొడవునా నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు అంచనా విలువను రూ.2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధారించింది. సికింద్రాబాద్‌కాజీపేట మార్గంలో రైళ్ల రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఈ నాలుగో లైన్ అందుబాటులోకి వస్తే సరకు రవాణాతోపాటు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగం, సమయపాలన మెరుగుపడనుంది.

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం**

సికింద్రాబాద్ - కాజీపేట్ మధ్య మల్టీ ట్రాకింగ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించడం పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మోదీకి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రైల్వే బడ్జెట్ కేటాయింపులు 21 రెట్లు పెరిగాయని, గత పన్నెండేళ్ల కాలంలో రూ.36,286 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. దీంతోపాటు రాష్ట్రంలో దాదాపు రూ.50 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, మరో రూ.50 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఫైనల్ లొకేషన్ సర్వే జరుగుతోందని పేర్కొన్నారు. రైల్వే లైన్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రస్తుతం 42 స్టేషన్లలో దాదాపు రూ.3,000 కోట్లతో అత్యాధునిక మౌలిక సదుపాయాలను కల్పించి అమృత్ భారత్ స్టేషన్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామన్నారు.

# 170 ఏళ్ల హనుమంతుడి విగ్రహం కదలలేదు!

- రోడ్డు విస్తరణలో సాంకేతికతకు చిక్కని ముడి
- విగ్రహం తరలింపుపై భక్తుల ఆగ్రహం

**ఉజ్జయిని, సెప్టెంబర్ 10:**

సింహస్థ 2028 కుంభమేళా ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కంతాల్ నుంచి ఛత్రీ చౌక్ వైపు వెళ్లే మార్గంలో ఉన్న సుమారు 170 ఏళ్లనాటి ఖడే హనుమాన్ విగ్రహాన్ని తరలించేందుకు అధికారులు, ఇంజనీర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇండోర్ నుంచి ప్రత్యేకంగా రప్పించిన నిపుణులు అత్యాధునిక సాంకేతికతతో ప్రయత్నించినా.. రెండు రోజులుగా విగ్రహం అంగుళం కూడా కదలలేదు. దీంతో ఇది దైవ శక్తి మహిమేనని స్థానికులు, భక్తులు విశ్వసిస్తున్నారు.

**రాజసవారీకి సమయం తక్కువ**

మరో రెండు రోజుల్లో ఇదే మార్గం మీదుగా శ్రీ మహాకాళేశ్వరుడి రాజసవారీ జరగాల్సి ఉంది. దీంతో విగ్రహం తరలింపు వ్యవహారం యంత్రాంగానికి సవాలుగా మారింది. ప్రస్తుతానికి విగ్రహానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా భద్రత కోసం అక్కడ టెంట్ ఏర్పాటు చేశారు. ఈ పరిణామంతో ఆలయం పరిసరాల్లో భక్తిమయ వాతావరణం నెలకొంది.

**ఆలయ గోడ కూల్చివేతపై ఆగ్రహం**

ఆలయ కాంపౌండ్ గోడను అధికారులు ఇప్పటికే కూల్చివేయడంపై స్థానికులు, హిందూ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వందలాది మంది కార్యకర్తలు, భక్తులు ఆలయం వద్ద మహాహారతి నిర్వహించారు. ఆలయానికి ఇరువైపులా ఇప్పటికే రహదారి ఉన్నందున నిర్మాణాల తొలగింపుపై అధికారులు పునరాలోచించాలని పూజారి సులభ్ శాంతను శర్మ, కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**లిఖితపూర్వక హామీ ఇవ్వాలి**

టాంకీ చౌక్ వద్ద ఎలాంటి నష్టం జరగకుండా విగ్రహాన్ని సురక్షితంగా తరలించి పునఃప్రతిష్ఠిస్తామని అధికారులు లిఖితపూర్వక హామీ ఇచ్చిన తర్వాతే విగ్రహాన్ని తరలించేందుకు అనుమతిస్తామని పూజారి స్పష్టం చేశారు. లేదంటే విగ్రహాన్ని





ముట్టుకునేందుకు కూడా అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు.

**పునాది స్కానింగ్ తర్వాతే నిర్ణయం**

పరిస్థితి సున్నితంగా మారడంతో తొందరపాటు నిర్ణయం తీసుకోకూడదని యంత్రాంగం భావిస్తోంది. పూర్తి గౌరవంతో, సురక్షిత పద్ధతిలోనే విగ్రహాన్ని టాంకీ చౌక్‌కు తరలించాలనేది తమ ఉద్దేశమని తహసీల్దార్ షెఫాలీ జైన్ తెలిపారు. ఇప్పటికే విగ్రహం పునాది పరిస్థితిని తెలుసుకునేందుకు 1.5 అడుగుల మేర గుంతతవ్వారు. అనంతరం పురావస్తు శాఖ నిపుణుల బృందాన్ని రంగంలోకి దించారు. అత్యాధునిక యంత్రాలతో విగ్రహం పునాది, లోపలి నిర్మాణం, చుట్టుపక్కల నేల స్వభావాన్ని వారు పరిశీలిస్తున్నారు. స్కానింగ్ నివేదిక వచ్చిన తర్వాతే విగ్రహాన్ని తరలించేందుకు అనుసరించాల్సిన సాంకేతికతపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# వైవాహిక అత్యాచారంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:**

వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పెళ్లయినంత మాత్రాన మహిళ వ్యక్తిగత స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛకు భంగం కలగకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. భార్య సమ్మతి లేకుండా భర్త లైంగిక సంబంధం పెట్టుకున్నా అత్యాచారంగా పరిగణించని చట్టపరమైన మినహాయింపును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ధర్మాసనం విచారణ ప్రారంభించింది.

**ప్రత్యేక ధర్మాసనం విచారణ**

సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం కేసును విచారిస్తోంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేసినట్లు కోర్టు తెలిపింది. అన్ని పక్షాలు సమర్పించిన వాదనలను సమగ్రంగా క్రోడీకరించాలని ఆదేశించింది. వ్యాజ్యాలపై ప్రతి బుధవారం, గురువారం తుది విచారణ కొనసాగుతుందని ధర్మాసనం వెల్లడించింది.

**మినహాయింపు తొలగింపును వ్యతిరేకించిన కేంద్రం**

ఐపీసీ సెక్షన్ 375, ప్రస్తుతం అమల్లో ఉన్న బీఎన్ఎస్ సెక్షన్ 63 ప్రకారం 18 ఏళ్లు పైబడిన భార్యతో భర్త జరిపే లైంగిక చర్యలకు అత్యాచారం నిబంధన నుంచి మినహాయింపు ఉంది. దీనిని తొలగిస్తే వివాహ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు కుటుంబ, సామాజిక సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని కేంద్రం గతంలో సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ అంశాన్ని కేవలం చట్టపరమైన కోణంలో కాకుండా సామాజిక పరిణామాలను పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా పరిశీలించాలని కోరింది.

**హైకోర్టుల భిన్న తీర్పులు**

వైవాహిక అత్యాచార మినహాయింపుపై ఢిల్లీ హైకోర్టులో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడగా.. మరో న్యాయమూర్తి దాన్ని సమర్థించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఖుష్బూ సైఫీ, ఆర్‌ఐటీ ఫౌండేషన్, ఆలిండియా డెమోక్రటిక్ విమెన్స్ అసోసియేషన్ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# పార్లమెంటరీ విలువలే ప్రధానం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:**

ప్రజాస్వామ్య దేవాలయాలైన చట్టసభల్లో పార్టీల కంటే పార్లమెంటరీ విలువలే ప్రధానమని, ప్రజాప్రతినిధుల ప్రవర్తనలో మార్పు రావాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన 'సంసద్ రత్న' అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కీలక ప్రసంగం చేశారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయాలి, ప్రశ్నించాలి కానీ చట్టసభలను అడ్డుకోవడం సరికాదు. ఒకప్పటి హుందాతనం లోపించి రాజకీయ విలువలు దిగజారుతుండటం భవిష్యత్ తరాలకు తప్పుడు సందేశం ఇస్తోంది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ



లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు అత్యంత అప్రజాస్వామికంగా ఉందని విమర్శించారు. చొక్కాలు విప్పామని, విప్పించామని సంబరపడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తుందని మండిపడ్డారు.

**స్పీక్ ఔట్.. లేదా వాకౌట్**

ప్రభుత్వ తీరు నచ్చకపోతే సునిశితంగా విమర్శించాలి (స్పీక్ ఔట్), లేదంటే వాకౌట్ చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పేవారని, కానీ నేటి విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంపైనే దృష్టి పెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీల సిద్ధాంతాలు వేరైనా దేశ ప్రయోజనాల విషయంలో అంతా ఏకతాటిపై నిలబడాలి. ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర రాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలు చేసి ప్రజల్లో వాటిపై నమ్మకం పోగొట్టడం సరికాదని హితవు పలికారు.

**నా ఎదుగుదల ప్రజాస్వామ్య గొప్పదనమే**

సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను ఈ స్థాయికి ఎదగడం భారత ప్రజాస్వామ్య గొప్పదనమేనని ఆయన అన్నారు. వాజపేయి, పీవీ నరసింహారావు లాంటి వారి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన తాను.. ఏనాడూ అసెంబ్లీ వెల్‌లోకి అడుగుపెట్టలేదని, సభ జరిగిన ప్రతిరోజూ హాజరయ్యానని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన 16 మంది ఎంపీలకు 'సంసద్ రత్న' అవార్డులను అందజేశారు. ఈ వేడుకలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత్ మజూందార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, మాజీ మంత్రి హన్సరాజ్ గంగారాం ఆహిర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**విద్యార్థులకు ప్రీ-వొకేషనల్ విద్యపై అవగాహన.. లక్ష్య సాధనకు ఏకాగ్రతతో కృషి చేయాలి**




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, విద్యార్థులు భవిష్యత్తులో వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ కామన్ ఫార్మర్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మగాని నరసింహారావు సూచించారు. బుధవారం జల్లేపల్లి, బీరోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 'వ్యవసాయంలో ప్రీ-వొకేషనల్ విద్య మార్గదర్శకాలు' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గెస్ట్ లెక్చరర్‌గా పాల్గొన్న నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. నేల, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నీటి యాజమాన్యంపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టు, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించడం ద్వారా తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. తాను మెట్ట ప్రాంతంలో టమాట పంట సాగు చేసి అధిక దిగుబడి సాధించిన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వ్యవసాయ విద్యను అభ్యసించి నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని కోరారు.

**లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి**

రిటైర్డ్ ఎండీఓ ఎం.డి. నవాబ్ పాషా కెరీర్ గైడెన్స్, టైమ్ మేనేజ్‌మెంట్, గోల్ సెట్టింగ్, యాంటీ నార్కోటిక్ అవేర్‌నెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ముందుగా తమ ఆసక్తిని గుర్తించి స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. పదో తరగతి అనంతరం ఉన్నత విద్య, వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఒక్కసారి విఫలమైనంత మాత్రాన నిరాశ చెందకుండా, పట్టుదలతో మళ్లీ ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

**కాళోజీకి నివాళి**

తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధారా రాజేష్ పుష్పమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినుల తెలంగాణ పాటకు నృత్య ప్రదర్శనతో కార్యక్రమం ప్రారంభమైంది. ప్రధానోపాధ్యాయుడు ధారా రాజేష్ మాట్లాడుతూ.. నరసింహారావు అందించిన వ్యవసాయ మార్గదర్శకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, వాటిని తల్లిదండ్రులకు కూడా తెలియజేసి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించవచ్చన్నారు. నవాబ్ పాషా కెరీర్ గైడెన్స్ విద్యార్థులకు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్ బోదులబండలో స్పెషల్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థులకు షూస్ పంపిణీ**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు విద్యాశాఖ అధికారి బి. రవిబాబు మంగళవారం నేలకొండపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోదులబండను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఆయన పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వంట గదిలో నిల్వ ఉన్న బియ్యం, పప్పు, నూనె, గుడ్ల నాణ్యతను పరిశీలించారు. మెనూ చార్టు ప్రకారం భోజనం అందించడం లేదని గుర్తించారు. ఈ రోజు మెనూ ప్రకారం ఉండాల్సిన పప్పు, గుడ్డు ఇవ్వకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.వెంటనే ప్రధానోపాధ్యాయుడిని పిలిపించి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే ప్రతిరోజూ తప్పనిసరిగా మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని గట్టిగా ఆదేశించారు. భోజనం నాణ్యత మెరుగుపరచాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం పాఠశాలకు మంజూరు చేసిన విద్యార్థుల యూనిఫాం షూస్ ను మండల అభివృద్ధి అధికారి (ఎం పిడిఓ) తో కలిసి విద్యార్థులకు స్వయంగా అందజేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువుపై శ్రద్ధ పెట్టాలని, క్రమం తప్పకుండా బడికి రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ చలపతిరావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ అక్రమ అరెస్టులు కాదు..

- ఎన్నికల హామీలను అమలు చేయండి:
- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రతిపక్ష పార్టీలపై అక్రమరస్తులు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో ఎమ్మెల్సీ తాత మధుసూదన్ స్వగృహంలో నిర్వహించిన టిఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం కాకుండా ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాతా మధు అక్రమ అరెస్టుకు నిరసనగా దశలవారీగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం మోటార్లను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాషబోయిన వీరన్న మండల నాయకులు బిల్లగిరి ధనుంజయ్ పిండిప్రోలు ఉప సర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ మాజీ సర్పంచ్ బోడ మంచనాయక్ మాజీ ఎంపిటిసి ధరావత్ శంకర్ తాత రవీందర్ పరికిపల్లి చంద్రశేఖర్ ముత్తయ్య చామకూరి వెంకన్న పిడతల రవీందర్ పోలిపొంగు వెంకటేశ్వర్లు వేల్పుల సైదులు జనక రమేష్ బానోత్ రవి భూక్య వీరన్న గంట కృష్ణ గుగ్గిళ్ళ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత..

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** మౌలిక వస్తువుల కల్పనకు ప్రాధాన్యతనిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం చేవెళ్ల పట్టణంలో 17 వ వార్డు రంగారెడ్డి నగర్ లో 50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చేవెళ్ల పట్టణంలోని 17వ వార్డులో ప్రజల ఎన్నో రోజుల కళను నెరవేర్చే విధంగా రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు రాకపోకలకు ఎంతో సౌకర్యంగాఉంటుందన్నారువర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గుతాయని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాము అని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుతోనే ఆరోగ్యం.. అధిక లాభాలు

- రసాయనాలు వీడండి.. భూసారాన్ని రక్షించండి
- పెట్టుబడి తగ్గి.. నాణ్యమైన దిగుబడులు
- రాజారం గ్రామంలో రైతులకు 'ఆత్మ' ఆధ్వర్యంలో పంటలపై శిక్షణ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** రైతాంగం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్) వైపు అడుగులు వేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాజారం గ్రామంలో 2026 'ఆత్మ' పథకం ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పంటలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌తో పాటు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ పావని, మండల వ్యవసాయ అధికారి సీతారామరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉప్పునూతల నాగేశ్వరరావు, ఏఈఓ ప్రదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**మానవాళి ఆరోగ్యానికి సేంద్రియమే రక్ష**

ఈ సందర్భంగా ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉప్పునూతల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మితిమీరిన రసాయనాల వాడకం వల్ల భూములు నిస్సారమవడమే కాకుండా, పండించే పంటలు కూడా విషతుల్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులందరూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో పంటలు పండించడం ద్వారా పంటల ఆరోగ్యంతో పాటు, ఆ ఆహారాన్ని తినే మనుషుల ఆరోగ్యం కూడా ఎంతగానో మెరుగ్గా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి:**

అనంతరం కేవీకే కోఆర్డినేటర్ పావని మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం వల్ల భూమిలో సహజంగా ఉండే పోషకాలు మొక్కలకు సులభంగా అందుబాటులోకి వస్తాయని శాస్త్రీయంగా వివరించారు. దేశవాళీ పద్ధతుల ద్వారా భూసారం గణనీయంగా పెరుగుతుందన్నారు. దీనివల్ల సాగు పెట్టుబడి ఖర్చులు భారీగా తగ్గుతాయని, నాణ్యమైన అధిక దిగుబడులను సాధించి రైతులు ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని ఆమె దిశానిర్దేశం చేశారు.ఈ శిక్షణా కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని, సేంద్రియ ఎరువుల తయారీ, యాజమాన్య పద్ధతులపై అధికారులను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# చేవెళ్లలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యాదయ్య...

**ఇందిరమ్మ మైనార్టీ మహిళా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ...**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మండలం ఖానాపూర్ గేట్‌లోని శ్రీనివాస కళ్యాణ మండపంలో చేవెళ్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, అలాగే నియోజకవర్గంలోని ఇందిరమ్మ మైనార్టీ మహిళా లబ్ధిదారులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను స్థానిక శాసనసభ్యులు కాలె యాదయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, ఒక మున్సిపాలిటీకి చెందిన 16 మంది ఇందిరమ్మ మైనార్టీ మహిళా లబ్ధిదారులకు మొత్తం రూ.8 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కాలె యాదయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం (టాస్క్) అధ్యర్యంలో జర్నలిస్టు ఖాసీం కి ఘన సన్మానం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం (టాస్క్) రాష్ట్ర కో కన్వీనర్ ములక సురేష్ అధ్యర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్(టీజేఏ) ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన షేక్ సయ్యద్ ఖాసీం కి ఘన సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కవులు ఆంజనేయులు కటుకోజ్వాల రమేష్ బుక్క సత్యనారాయణ పంజాల ఐలయ్య సంగమేశ్వరావు రమణ రేల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్న స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్పర్సన్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామిని తెలంగాణ స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్ పర్సన్ సీత దయాకర్ రెడ్డి కాలభైరవ స్వామిని బుధవారం రోజున ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు, పంతులు శ్రీనివాస్ శర్మ ధూప దీప నైవేద్యాలతో, పాలాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు, అనంతరం వారికి ఆలయ సిబ్బంది శాలువాతో సత్కరించి కాలభైరవ స్వామి జ్ఞాపకను అందజేశారు, వారి వెంట డి ఐఇఓ సలాం, డిఇఓ మల్లికార్జున్, సిడిపిఓ సుజాత, సి డబ్ల్యూ సి మెంబర్ స్వర్ణలత, సిడిపిఓ స్రవంతి, సూపర్వైజర్ గిరిజ, జ్యోతి తదితరులు ఉన్నారు, వారికి కూడా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి జ్ఞాపకను అందజేశారు, ఆలయ సిబ్బంది అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీలకుత నిధులు మంజూరు చేయాలని రామారెడ్డి మండలం గ్రామ సర్పంచ్లు పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జలసిరి, భగీరథ ప్రాథమిక సరఫరా పంచాయతీ రాజ్ పనులు, విద్యుత్ శాఖ, పశుసంవర్ధక శాఖ, విద్యాశాఖ, అంగన్వాడి, వ్యవసాయ శాఖ, ఇందిరమ్మ గృహాలు నిర్మించుట, పెన్షన్ల గురించి సమావేశంలో చర్చించడం జరిగింది. సర్పంచులు అడిగిన ప్రశ్నలకు ఎంపీడీవో కే. నాగేశ్వర్ గుప్తా సమాధానాలు చెప్పారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎఇ విష్ణువర్ధన్ రావు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, పశువైద్యాధికారి రామచందర్, కరెంటు ఏ ఈ సుధాకర్, వ్యవసాయ శాఖ భాను శ్రీ, ఐకెపి ఎపిఎం పద్మావతి, ఈజీఎస్ ఏపీవో ధర్మారెడ్డి, సర్పంచులు బండి ప్రవీణ్, నాగులాపల్లి రాజేందర్, దోకి లచ్చయ్య, కిషన్ యాదవ్, బుచ్చిరెడ్డి, సుద్దాల లింగం, గొల్ల మహేష్ ,సరిత శ్రీనివాస్ గౌడ్, శివరాణి రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు రాజు, అరవింద్ రెడ్డి, సాగర్ గౌడ్, సంజీవ్, నరేష్, ప్రశాంత్, రాజేష్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు పెండింగ్ 3నెలల జీతాలు ఇవ్వాలి

- యూనిఫాంలు సబ్బులు నూనెలు సెటర్లు ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ కు మెమొరాండం,
- సీఐటీయూ యూనియన్ డిమాండ్.



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బుధవారం వికారాబాద్ మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు పెండింగ్ 3నెలల జీతాలు ఇవ్వాలని యూనిఫాంలు సబ్బులు నూనెలు బూట్లు ఇవ్వాలని సిఐటియు యూనియన్ నాయకులు ఆర్ మహిపాల్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామన్నారు. రేపటి నుండి పనిప్రదేశంలో ఆందోళన పోరాటాలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఆర్ మహిపాల్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, శంకర్ నాయక్ బుచ్చయ్య అనంతయ్య యాదయ్య గట్టేయా హిర్యానాయక్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు

## కాళోజి నారాయణరావు చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బుధవారము వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అద్వర్యంలో ఏర్పాటు చేసిన కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని జిల్లాలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక ఉద్యమకారుడు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళోజి నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రపంచానికి తెలియజేసిన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన సాహిత్యంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి కాళోజి అని పేర్కొన్నారు. సామాజిక అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. కాళోజి ఆశయాలు, ఆలోచనా విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, యువత ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేసి సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మానవతా దృక్పథం కోసం కాళోజి చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, డి ఆర్ ఓ స్వర్ణ లత, ఆర్ డి ఓ వాసుచంద్ర, డిప్యూటి కలెక్టర్ పూజ, వ్యవసాయ శాఖ అధికారి కవిత, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారామెడికల్ ఆప్తమిక్ ఆఫీసర్లు, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం టీం లతో సమీక్షా సమావేశం



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బుధవారం వికారాబాద్ జిల్లా డి ఎం హెచ్ ఓ కార్యాలయంలో పారామెడికల్ ఆప్తమిక్ ఆఫీసర్లు, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం టీం లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె సుధాకర్ లాల్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి పాఠశాల ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ స్క్రీనింగ్ కార్యక్రమంలో కంటి సంబంధ సమస్యలు గుర్తించడం, అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించడం కొరకు ఉన్నత శ్రేణి ఆసుపత్రులకు రిఫర్ చేయడం కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అందుకు పాఠశాల వారీగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లలో పనిచేస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా సమన్వయంతో పని చేయాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు హెచ్ ఎమ్ ఐ ఎస్ పోర్టల్ లో నమోదు చేయాలని, రక్తపోటు మధుమేహము వ్యాధిగ్రస్తుల స్క్రీనింగ్ అనంతరం ఎన్ సి డి పోర్టల్ లో నమోదు చేయాలని, ఇంటిగ్రేటెడ్ డిసీస్ సర్వేలెన్స్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సి హెచ్ సి వైద్యాధికారులు, నర్సింగ్ ఆఫీసర్లు, పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, ఆర్ బి ఎస్ కె వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మదీనాగూడలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు




**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** ప్రజాకవి, తెలంగాణ రచయిత కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ తెలుగు భాషా దినోత్సవాన్ని మదీనాగూడలోని కళ్లం అంజిరెడ్డి విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనం, సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్య వైభవాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు కవులు, రచయితలు, చారిత్రక ప్రముఖుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ డా. విజయలక్ష్మి మాట్లాడుతూ – తెలుగు భాష పరిరక్షణ, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వాహిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కోదాడలో వరుస ఇళ్ల దొంగతనాలకు చెక్

**10 కేసులు ఛేదించిన పోలీసులు.రూ.60 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు, కారు స్వాధీనం**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** కోదాడ పట్టణంలో వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని కోదాడ పట్టణ పోలీసులు, జిల్లా సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన 37.2 తులాల బంగారు ఆభరణాలు, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, కారు, మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన స్క్రూడ్రైవర్లు, షూ సాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కె. నర్సింహ, ఐపీఎస్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు పట్నం శెట్టి రాజు అలియాస్ రాజిరెడ్డి (41), కారు డ్రైవర్‌గా పనిచేస్తూ పాపిరెడ్డినగర్ కాలనీ, జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితుడు 2009లో ఖమ్మం పోలీస్ స్టేషన్ పరిధిలో సైకిల్ దొంగతనం చేసి జైలుకు వెళ్లాడు. అనంతరం 2015, 2016 సంవత్సరాల్లో జగద్గిరిగుట్ట పరిధిలో ఐదు ఇళ్లలో రాత్రి వేళ దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కి రిమాండ్‌కు వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు.

**తాళం వేసిన ఇళ్లే టార్గెట్**

నిందితుడు తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగా గుర్తించేవాడు. రాత్రి సమయంలో తన కారును నిర్మానుష్య ప్రాంతంలో పార్క్ చేసి, కాలినడకన వెళ్లి ఇళ్ల ప్రధాన ద్వారాల తాళాలను స్క్రూడ్రైవర్‌తో పగులగొట్టి లోపలికి ప్రవేశించేవాడు. అనంతరం బంగారం, వెండి ఆభరణాలు, నగదును అపహరించేవాడు. దొంగిలించిన ఆభరణాల్లో కొన్నింటిని విక్రయించడం, మరికొన్నింటిని కరిగించడం, ఇంకొన్నింటిని ఫైనాన్స్ సంస్థల్లో కుదవ పెట్టడం ద్వారా



వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలు, అప్పుల చెల్లింపులకు వినియోగించేవాడని పోలీసులు వెల్లడించారు. పోలీసులకు అనుమానం రాకుండా ఉండేందుకు తన కారు అసలు రిజిస్ట్రేషన్ నంబర్ ఏపీ 28 బై 7770కు బదులుగా నకిలీ నంబర్ టీస్ 07 జీసీ 1612ను ఉపయోగించినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రయాణికులను కారులో కోదాడకు తీసుకొచ్చిన అనంతరం రాత్రివేళ అక్కడే ఉండి, తెల్లవారుజామున పట్టణంలో సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడేవాడని పోలీసులు పేర్కొన్నారు.

**2021 నుంచి 10 దొంగతనాలు**

కోదాడ పట్టణంలో 2021 నుంచి ఇప్పటి వరకు నిందితుడు 10 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. 2026లోనే ఏడు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు**

నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు పోలీసులను గమనించి వాహనాన్ని వెనక్కి తీసుకొని తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కారును తనిఖీ చేయగా డిక్కీలోని కవర్లలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు లభించాయి. స్క్రూడ్రైవర్లు, షూ సాక్స్‌లు కూడా లభించడంతో పోలీసులు అతడిని విచారించగా కోదాడ పట్టణంలో చేసిన దొంగతనాల వివరాలను వెల్లడించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి హోండా అమజ్ కారు, వివో వై 31 5జి మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ**

ఈ సందర్భంగా ఎస్పీ కె. నర్సింహ మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడిన వారు ఎప్పటికైనా చట్టానికి చిక్కక తప్పదని అన్నారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కాలనీల్లోని ప్రధాన మార్గాల్లోనూ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కువ రోజులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు విలువైన వస్తువులు, నగదును ఇంట్లో ఉంచవద్దని, ఇరుగుపొరుగు వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగతనాల నివారణలో ప్రజలు పోలీసులకు సహకరించి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తూ నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

**పోలీసు సిబ్బందికి అభినందనలు**

కేసు దర్యాప్తును పర్యవేక్షించిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, నిందితుడి అరెస్టులో కీలకంగా పనిచేసిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, సీసీఎస్ ఎస్సైలు హరికృష్ణ, సాయిరాం, ఎస్సై అజయ్‌కుమార్, సీసీఎస్ సిబ్బంది వెంకన్న, విద్యాసాగర్, మల్లేష్, సతీష్, శివ, ప్రభాకర్, మంజులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

## సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణ

**సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నెహ్రూ నాయక్**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఖమ్మం జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షులు గుగులోతు నెహ్రూ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేనే వ్యవస్థాపక అధ్యక్షులు ధరావత్ ప్రేమ్ చందు నాయక్ సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షులు ఇంగోత్ రాంబాబు నాయక్ సేవాలాల్ సేన రైతు రాష్ట్ర అధ్యక్షులు భూక్య బద్రు నాయక్ సేవాలాల్ సేన సేవాలాల్ మహారాజ్ లా ఆశయాలను ముందుకు తీసుకెళ్లటంతో పాటు బంజారా సమాజం అక్కులు సంక్షేమం కోసం సేవాలాల్ సేన నిరంతరం పనిచేస్తుందని సేవాలాల్ సేన సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని ఖమ్మం జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షులు గుగులోత్ నెహ్రూ నాయక్ సేవాలాల్ సేన నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండలం గ్రామపంచాయతీ సర్పంచ్ దరావత్ సుజాత నరసింహారావు. తిరుమలాయపాలెం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల అశోక్. జేపీసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మందడి ఇజ్రాయిల్. సిపిఐ ఎంఎల్ పార్టీ మాస్ లైన్ సీనియర్ నాయకులు తిమ్మిడి హనుమంతరావు. పడమటి తండా సర్పంచ్ నీలిమ బాలాజీ. సేవాలాల్ సేన మండల అధ్యక్షులు ఇస్లావత్ బావ్ సింగ్. సేవాలాల్ సేన వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ధరావత్ రాజేందర్. భూక్య నాగేంద్రబాబు నాయక్. ధరావత్ పంతులు నాయక్. గుగులోత్ శ్రీకాంత్. ఈ కార్యక్రమంలో



పాల్గొన్న పలువురు నాయకులు కార్యకర్తలకు యువకులకు ఖమ్మం జిల్లా సేవా లాల్ సేన అధ్యక్షులు గుగులోతు నెహ్రూ నాయక్ సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# అంతర్రాష్ట్ర కరుడుగట్టిన దొంగ వికాస్ సింగ్ కేసులో కీలక పురోగతి

- యూపీలోని బంగారం దుకాణం నుంచి 25 తులాల బంగారం రికవరీ
- దొంగసొత్తు రిసీవర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర కరుడుగట్టిన నేరస్తుని వికారాబాద్ పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. వికారాబాద్ జిల్లా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీలో 01-05-2026 రాత్రి ఓ ఇంట్లో చోరీ చేసి బంగారం, నగదు అపహరించిన కేసులో అరెస్టు అయిన అంతర్రాష్ట్ర కరుడుగట్టిన దొంగ వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్ కేసులో వికారాబాద్ జిల్లా సిసిఎస్, వికారాబాద్ టౌన్ పోలీసులు కీలక పురోగతి సాధించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, డీఎస్పీ అంజయ్య పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ఆధ్వర్యంలో



ప్రత్యేక బృందం ఇట్టి కేసులో ఇప్పటికే అరెస్టు అయి జైలులో ఉంటున్న వికాస్ సింగ్‌ను పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ విచారణలో నిందితుడు వెల్లడించిన సమాచారంతో సీసీఎస్ పోలీసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్ జిల్లా కుడువర్ టౌన్‌లోని బాబా సాలిక్ రామ్ బంగారం దుకాణం నుంచి తన తల్లి లీలావతి ద్వారా గిరవు పెట్టిన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 7 కేసులు, పరిగి పిఎస్ పరిధి లోని ఒక కేసు మొత్తం 8 కేసులకు సంబంధించిన సుమారు 25 తులాల బంగారాన్ని రికవరీ చేశారు. నిందితుడి విచారణలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. చోరీ చేసిన బంగారాన్ని యూపీలోని కుడువర్ ఇతర ప్రాంతాల్లోని కొందరు బంగారం వ్యాపారులకు విక్రయించేవాడని తేలింది. అశోక్ కుమార్ సోనీ, వికాస్ అగ్రహారి తదితరుల బంగారం దుకాణాల నుంచి కూడా దొంగసొత్తును రికవరీ చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. రిసీవర్లపై కఠిన చర్యలుదొంగసొత్తును కొనుగోలు చేసే రిసీవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. దొంగసొత్తును ప్రోత్సహించడం, కొనుగోలు చేయడం ద్వారా నేరాలకు సహకరించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రికవరీలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, సిబ్బంది జయవర్ధన్, శివకుమార్, సాయప్ప, రామకృష్ణ, రాజు, శివరాజ్, వెంకటేష్, పాండురంగం పాల్గొన్నారు. అంతర్రాష్ట్ర నిందితుడిని పట్టుకుని, కస్టడీ విచారణ ద్వారా దొంగసొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్, వికారాబాద్ టౌన్ పోలీసులను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా అభినందించారు.

# షాబాద్ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం

- విద్యార్థి కాలుపైకి దూసుకెళ్లిన బస్సు....
- బాలుడి కాలుకి తీవ్ర గాయాలు...

**షాబాద్, రాజముద్ర న్యూస్:** షాబాద్ బస్టాండ్‌లో బుధవారం ఆర్టీసీ బస్సు ప్రమాదం చోటుచేసుకోవడంతో ప్రయాణికులు, విద్యార్థుల్లో భయాందోళన నెలకొంది. బస్టాండ్‌లోకి వస్తున్న ఆర్టీసీ బస్సు ఓ విద్యార్థి కాలుపై నుంచి వెళ్లడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో విద్యార్థి కాలు విరిగినట్లు సమాచారం.వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి షాబాద్ మండలం అంతారం గ్రామానికి చెందిన జశ్వంత్ స్థానిక మోడల్ స్కూల్‌లో చదువుతున్నాడు. బుధవారం షాబాద్ బస్టాండ్‌లో ఉన్న సమయంలో రేగడి–చిలుకమర్రి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వచ్చింది. ఈ సమయంలో బస్సు చక్రం జశ్వంత్ కాలుపైకి దూసుకెళ్లడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, ప్రయాణికులు వెంటనే స్పందించి విద్యార్థిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో బస్టాండ్‌లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.వేగ నియంత్రణ లేకపోవడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రయాణికులు ఆరోపించారు. బస్టాండ్‌లోకి ప్రవేశించే సమయంలో ఆర్టీసీ బస్సులు వేగాన్ని నియంత్రించకపోవడం వల్లే ఇలాంటి




ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్‌లో నిత్యం విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని, బస్సుల వేగం కారణంగా ప్రమాదాలకు అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో వేగ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి ప్రవేశించే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే విద్యార్థికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకో



వాలని, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అధికారులు విచారణ జరిపి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రయాణికుల భద్రతకు బస్టాండ్‌లో ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



# వరద గుప్పిట్లో ఆసియా క్రీడల వేదిక!

## నాగోయాలో కుండపోత వర్షాలు

## అథ్లెట్లను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## గంటలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం

## రవాణా సేవలకు తీవ్ర అంతరాయం

## క్రీడలకు ఇబ్బంది లేదంటున్న అధికారులు

**నాగోయా, సెప్టెంబర్ 9 :** జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడలపై భారీ వర్షాలు, వరదల ప్రభావం పడుతోంది. క్రీడలకు ప్రధాన వేదికగా ఉన్న నాగోయాలో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ముందు జాగ్రత్తగా వందలాది మంది అథ్లెట్లు, సహాయక సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే పోటీ వేదికలకు ఎలాంటి నష్టం జరగలేదని, నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే క్రీడలు జరుగుతాయని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. నాగోయాలో మంగళవారం ఒక్క గంట వ్యవధిలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అథ్లెట్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని అత్యవసర చర్యలు చేపట్టారు. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి ప్రాంతాల్లోని వారిని ముందు జాగ్రత్తగా ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. షిప్పింగ్ కంటైనర్లతో ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి కేంద్రాల్లో ఉన్నవారిని కూడా మార్చినట్లు సమాచారం. దాదాపు 400 మంది క్రీడాకారులు, ఇతర సిబ్బంది తాత్కాలిక ఆశ్రయ కేంద్రాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అథ్లెట్లందరూ సురక్షితంగానే ఉన్నారని జపాన్ అధికారులు వెల్లడించారు. వర్షాలు, వరదల కారణంగా క్రీడా వేదికలకు ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదని పేర్కొన్నారు.

### రవాణాపై వర్షాల దెబ్బ

నాగోయాలోని పలు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజా రవాణాపైనా ప్రభావం పడింది. కొన్ని సబ్‌వే, బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. మరింత భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు జపాన్‌కు చేరుకుంటున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులను నిర్వాహకులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ఆసియా క్రీడల నిర్వహణకు ముప్పు లేదని అధికారులు చెబుతున్నప్పటికీ.. భారీ వర్షాలు కొనసాగితే ఏర్పడే పరిస్థితులపై ఆందోళన నెలకొంది. అథ్లెట్ల భద్రతతో పాటు రవాణా, వసతి ఏర్పాట్లు ఇప్పుడు నిర్వాహకులకు ప్రధాన సవాల్‌గా మారాయి.




# హోరాహోరీ పోరులో ఆల్కరాజ్ ఔట్..

## యూఎస్ ఓపెన్ సెమీస్‌లోకి బెన్ షెల్టన్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాజ్ నిష్క్రమించాడు. ఇవాళ హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అమెరికన్ ప్లేయర్ బెన్ షెల్టన్ అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. అయిదు సెట్ల థ్రిల్లింగ్ మ్యాచ్‌ను 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(7) స్కోరుతో షెల్టన్ గెలుచుకున్నాడు. మడిమ గాయం నుంచి కోలుకుని టోర్నీలో అడుగుపెట్టిన అల్కరాజ్.. ఈ మ్యాచ్‌లో చివరి వరకు పోరాడు. సుమారు 4 గంటల 28 నిమిషాల పాటు ఈ మ్యాచ్ జరిగింది. అల్కరాజ్‌పై తన కెరీర్‌లో తొలిసారి విజయం సాధించాడు బెన్. నాలుగు నెలల గాయం తర్వాత అల్కరాజ్ ఆడిన ఫస్ట్ టోర్నీ ఇదే. కానీ అతని ఆశలపై నీళ్లు చల్లాడు యువ ప్లేయర్ షెల్టన్. గాయం వల్ల స్పెయిన్ ప్లేయర్ అల్కరాజ్ సరైన రీతిలో తన సత్తాను ప్రదర్శించలేకపోయాడు. సమారు 52 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేశాడు. టైబ్రేకర్ వరకు వెళ్లిన తొలి సెట్‌ను అల్కరాజ్ చివరకు సొంతం చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత చాలా భీకరంగా షెల్టన్ చెలరేగిపోయాడు. రెండవ, మూడవ సెట్లను బెన్ ఈజీగా నెగ్గేశాడు. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. కానీ నాలుగో సెట్‌లో అల్కరాజ్ తన రిథమ్‌ను మళ్లీ అందుకున్నాడు. బేస్‌లైన్ షాట్లు, స్పీడ్‌తో ఆ సెట్‌ను 6-1 తేడాతో నెగ్గి మ్యాచ్‌ను డిసైడర్ సెట్‌లోకి పంపాడు. ఇక ఆ ఫైనల్ సెట్‌లో ఇద్దరూ అమీతుమీ అన్నట్లుగా ఆడారు. సూపర్ టైబ్రేక్‌కు ఆ సెట్ వెళ్లింది. స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు తీవ్ర ఉత్కంఠకు లోనయ్యారు. కానీ చివరకు బెన్ షెల్టన్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. 10-7తో టైబ్రేక్ సాధించాడు. దీంతో అతను రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో క్వార్టర్స్ మ్యాచ్‌ను ఆలస్యంగా ప్రారంభించారు. దీనికి తోడుగా 4 గంటలకు పైగా మ్యాచ్ సాగడం వల్ల.. తెల్లవారుజామున మూడున్నరకు మ్యాచ్ ముగిసింది.

# బిగ్‌బాష్‌లోకి ప్రైవేట్ ఎంట్రీ

- ఐపీఎల్ ఓనర్లకు బంపర్ ఛాన్స్!
- ప్రైవేట్ పెట్టుబడులకు క్రికెట్ ఆస్ట్రేలియా గ్రీన్‌సిగ్నల్
- 2027-28 సీజన్ నుంచి కొత్త యాజమాన్య విధానం
- తొలుత మెల్‌బోర్న్ రెనెగేడ్స్ విక్రయానికి రంగం సిద్ధం
- ప్రపంచ టీ20 మార్కెట్‌లో ఐపీఎల్ యజమానులకు మరో అవకాశం
- నియంత్రణ మాత్రం క్రికెట్ ఆస్ట్రేలియా చేతుల్లోనే



**మెల్‌బోర్న్, సెప్టెంబర్ 9 :** ఆస్ట్రేలియా క్రికెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. దేశంలో అత్యంత ఆదరణ పొందిన బిగ్‌బాష్ లీగ్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరిచేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా సిద్ధమైంది. 2027-28 సీజన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుండగా.. మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌ను తొలిసారిగా పూర్తిస్థాయి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలు టీ20 జట్లను కలిగి ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులకు మరో భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటివరకు ప్రపంచంలోని ప్రధాన టీ20 లీగ్‌లతో పోలిస్తే బిగ్‌బాష్‌లో ప్రైవేట్ ఫ్రాంచైజీ యాజమాన్యానికి అవకాశం లేకపోవడం ప్రత్యేకత. తాజా నిర్ణయంతో ఆ పరిస్థితి మారనుంది. అయితే బిగ్‌బాష్‌ను పూర్తిగా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టకుండా కీలక నియంత్రణలను క్రికెట్ ఆస్ట్రేలియానే కొనసాగించనున్నట్లు సమాచారం.

### ఐపీఎల్ ఓనర్ల కన్ను పడితే..!

ఐపీఎల్ జట్ల యజమానులు ఇప్పటికే దక్షిణాఫ్రికా, యూఏఈ, అమెరికా, వెస్టిండీస్, ఇంగ్లండ్ సహా వివిధ దేశాల్లోని టీ20 లీగ్‌ల్లో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆస్ట్రేలియా మార్కెట్ కూడా అందుబాటులోకి వస్తే ప్రపంచ టీ20 క్రికెట్‌లో వారి వ్యాపార సామ్రాజ్యం మరింత విస్తరించే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, జీఎంఆర్-జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఇప్పటికే వివిధ దేశాల్లో ఫ్రాంచైజీలను నిర్వహిస్తున్నాయి. బిగ్‌బాష్‌లోనూ జట్లను సొంతం చేసుకుంటే ఒకే యాజమాన్యం కింద వివిధ లీగ్‌ల్లో ఆటగాళ్లను కొనసాగించే వ్యూహాలకు మరింత అవకాశం లభించవచ్చు.

### ఒకే బ్రాండ్.. పలు లీగ్‌లు

కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి అంతర్జాతీయ ఆటగాళ్లను ఒకే యాజమాన్యానికి చెందిన ఐపీఎల్, ఎస్‌ఏ20, మేజర్ లీగ్ క్రికెట్, బిగ్‌బాష్ జట్లలో ఒప్పందాల ద్వారా కొనసాగించే అవకాశాలు పెరగవచ్చు. తద్వారా ఆటగాళ్ల నిర్వహణతో పాటు ఒకే బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించుకునేందుకు ఫ్రాంచైజీలకు అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడే మరో సమస్య ఉంది. బిగ్‌బాష్ సాధారణంగా డిసెంబర్--జనవరిలో జరుగుతుండగా అదే సమయంలో దక్షిణాఫ్రికా ఎస్‌ఏ20, యూఏఈ అంతర్జాతీయ లీగ్ టీ20 కూడా జరుగుతాయి. ఒకే యాజమాన్యానికి వివిధ లీగ్‌ల్లో జట్లు ఉంటే స్టార్ ఆటగాళ్లను ఏ జట్టుకు కేటాయించాలన్న విషయంలో అంతర్గత పోటీ తప్పకపోవచ్చు.

### భారత స్టార్లకు మాత్రం నో ఎంట్రీ

ఐపీఎల్ యజమానులు బిగ్‌బాష్ జట్లను కొనుగోలు చేసినా భారత పురుష క్రికెటర్లను అక్కడ ఆడించడం ప్రస్తుత నిబంధనల ప్రకారం సాధ్యం కాదు. భారత క్రికెట్ నియంత్రణ మండలి తన క్రికెటర్లు విదేశీ టీ20 లీగ్‌ల్లో పాల్గొనేందుకు సాధారణంగా అనుమతించడం లేదు. అయితే భారత మహిళా క్రికెటర్లు గతంలో బిగ్‌బాష్‌లో పాల్గొన్నారు. భవిష్యత్తులో రిటైర్డ్ లేదా ఒప్పంద పరిధిలో లేని పురుష ఆటగాళ్ల విషయంలో భారత బోర్డు నిబంధనలు సడలిస్తే బిగ్‌బాష్‌లో పెట్టుబడులు పెట్టే భారత ఫ్రాంచైజీలకు అదనపు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

### పగ్గాలు మాత్రం సీఏ చేతుల్లోనే

ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం కల్పించినా బిగ్‌బాష్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా నియంత్రణ కొనసాగనుంది. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, ఆటగాళ్ల లభ్యత, ప్రసార హక్కులు, జీతాల పరిమితి వంటి కీలక అంశాల్లో బోర్డుదే ప్రధాన పాత్రగా ఉండనుంది. ఫ్రాంచైజీలను కొనుగోలు చేయాలనుకునే సంస్థలను ఆమోదించడం లేదా తిరస్కరించే అధికారం కూడా క్రికెట్ ఆస్ట్రేలియాకే ఉండనున్నట్లు సమాచారం. యాజమాన్య వైవిధ్యాన్ని కాపాడేందుకు ఒకే దేశానికి లేదా ఒకే వర్గానికి చెందిన సంస్థలు ఎన్ని జట్లను సొంతం చేసుకోవచ్చన్న అంశంలోనూ పరిమితులు విధించే అవకాశముంది. మొత్తానికి బిగ్‌బాష్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకుంటే ప్రపంచ టీ20 క్రికెట్ వ్యాపారంలో మరో కీలక మార్పునకు నాంది పడనుంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీలను విస్తరిస్తున్న ఐపీఎల్ యజమానులకు ఆస్ట్రేలియా మార్కెట్ ఇప్పుడు కొత్త ఆకర్షణగా మారే అవకాశముంది.

# 100 వికెట్ల క్లబ్‌లో రాబిన్సన్ 'స్పెషల్'!

- 24వ టెస్టులోనే వంద వికెట్ల మైలురాయి
- సయీమ్ అయూబ్‌ను ఔట్ చేసి ఘనత
- 20లోపు సగటుతో అరుదైన రికార్డు
- బుమ్రా సరసన ఇంగ్లండ్ పేసర్
- పాక్‌పై వరుసగా మూడో టెస్టులోనూ జోరు




**బర్మింగ్‌హామ్, సెప్టెంబర్ 9 :** ఇంగ్లండ్ పేసర్ ఓలీ రాబిన్సన్ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. పాకిస్థాన్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం ప్రారంభమైన మూడో టెస్టులో సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి తన టెస్టు కెరీర్‌లో 100వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు. 32 ఏళ్ల రాబిన్సన్‌కు ఇది 24వ టెస్టు కావడం విశేషం. అంతేకాదు.. 100 వికెట్ల మైలురాయి చేరే సమయానికి 20 కంటే తక్కువ బౌలింగ్ సగటు కలిగిన అత్యంత అరుదైన ఆధునిక బౌలర్ల జాబితాలో రాబిన్సన్ చోటు సంపాదించాడు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గత వందేళ్లలో 100 టెస్టు వికెట్లు తీసిన సమయంలో అత్యుత్తమ సగటు నమోదు చేసిన బౌలర్‌గా రాబిన్సన్ నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా పేరిట ఉన్న రికార్డును అధిగమించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### సయీమ్‌తోనే 'సెంచరీ'

టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. రాబిన్సన్ తన తొలి ఓవర్‌లోనే సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసినప్పటికీ సమీక్షలో నిర్ణయం మారింది. అయితే తన తర్వాతి ఓవర్‌లోనే సయీమ్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపి 100వ వికెట్ మైలురాయిని అందుకున్నాడు.

### పాక్‌పై రాబిన్సన్ 'రాజ్'

ప్రస్తుత సిరీస్‌లో రాబిన్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టులోనూ 4-11, 4-24తో మరో ఎనిమిది వికెట్లు తీసి వరుసగా రెండోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండేళ్లకు పైగా టెస్టు జట్టుకు దూరంగా ఉండి తిరిగి వచ్చిన రాబిన్సన్.. ఇప్పుడు 100 వికెట్ల మైలురాయితో తన పునరాగమనాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకున్నాడు.

# రూ.130 కోట్లకు పైగా డీల్!

## బీసీసీఐతో చాట్‌జీపీటీ, క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్ ఒప్పందం

- మూడు దిగ్గజ బ్రాండ్లు అసోసియేట్ పార్ట్‌నర్లుగా ఎంపిక
- రూ.130 కోట్లకు పైగా ఆదాయంతో 44 శాతం వృద్ధి
- 2028 మార్చి వరకు భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు వర్తింపు

**ముంబై, సెప్టెంబర్ 9 :** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తమ స్వదేశీ క్రికెట్ సీజన్‌కు సంబంధించి ప్రముఖ పానీయాల బ్రాండ్ 'క్యాంపా', ఇన్సూరెన్స్ సంస్థ 'ఎస్‌బీఐ లైఫ్'తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'చాట్‌జీపీటీ'లను అసోసియేట్ పార్ట్‌నర్లుగా ప్రకటించింది. రాబోయే వెస్టిండీస్ సిరీస్‌తో ప్రారంభమై 2028 మార్చి వరకు (మొత్తం 35 మ్యాచ్‌లకు) ఈ భాగస్వామ్యం అమల్లో ఉండనుంది. ఈ రెండు సీజన్ల ఒప్పందం ద్వారా బీసీసీఐకి రూ.130 కోట్లకు పైగా ఆదాయం లభించనుండగా, గత సైకిల్‌తో పోలిస్తే ఒప్పంద విలువ ఏకంగా 44 శాతం పెరగడం విశేషం. బిడ్డింగ్‌లో క్యాంపా కోలా మ్యాచ్‌కు రూ.1.31 కోట్లు, ఎస్‌బీఐ లైఫ్ మరియు చాట్‌జీపీటీ మ్యాచ్‌కు రూ.1.2 కోట్ల చొప్పున బిడ్లు దాఖలు చేసి భాగస్వామ్య హక్కులను సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఏఐ, ఇన్సూరెన్స్, బెవరేజెస్ వంటి విభిన్న రంగానికి చెందిన అంతర్జాతీయ బ్రాండ్లు భారత క్రికెట్‌పై చూపుతున్న నమ్మకానికి ఈ భారీ డీల్ నిదర్శనమని తెలిపారు. భారత హోమ్ సీజన్ మార్కెట్‌లో ఎంతటి క్రేజ్, డిమాండ్ ఉందో ఈ 44 శాతం వృద్ధి స్పష్టం చేస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. గ్రౌండ్ బ్రాండింగ్, బ్రాడ్‌కాస్ట్ గ్రాఫిక్స్ ద్వారా ఈ బ్రాండ్లు ప్రచారం పొందనున్నాయి.



# దీపావళి బరిలో రామాయణ, 'మహాశక్తి' పోటీ!

ఈసారి దీపావళికి బాక్సాఫీసు సందడి రెట్టింపు కానుంది. భారీస్థాయిలో తెరకెక్కుతున్న పాన్ఇండియా చిత్రం 'రామాయణ'ను దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యశ్ నటిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడు మరో ఆసక్తికరమైన చిత్రం వెలుగుల పండగ సందర్భంగా బరిలో నిలిచేందుకు సిద్ధమవుతోంది. అది ఇంకేదో కాదు.. ప్రముఖ నటి నయనతార మరోసారి అమ్మవారి పాత్రలో నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్ 2'. తెలుగులో 'మహాశక్తి' టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ చిత్రంలో రెజీనా, దునియా విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ దర్శకుడు సుందర్.సి తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయన కూడా ఓ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఆరేళ్ల క్రితం ఆర్జే బాలాజీ దర్శకత్వంలో వచ్చిన 'మూకుత్తి అమ్మన్', తెలుగులో 'అమ్మోరు తల్లి' పేరుతో విడుదలై విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో మూకుత్తి అమ్మన్ 2'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అందుకనుగుణంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన నయతార ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది.

# "కొత్తవారిని త్రిష బాగా ప్రోత్సహిస్తారు: మాళవిక మోహనన్

ఇండస్ట్రీలో త్రిష లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు నటి మాళవిక మోహనన్. కొత్త వాళ్లను ఆమె ఎంతో ప్రోత్సహిస్తారని తెలిపారు. 'సర్దార్ 2' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ త్రిషతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ ప్రధానపాత్రలో తెరకెక్కిన 'పేట' సినిమాలో ఆమెతో కలిసి వర్క్ చేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఆమె తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని తెలిపారు. ''నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో 'పేట' అవకాశం వచ్చింది. రజనీకాంత్ సినిమా కావడంతో ఎంతో ఆనందించా. కానీ, కమర్షియల్ సినిమా చేసిన అనుభవం లేకపోవడంతో కంగారుపడ్డాను. వారణాసిలో షూటింగ్ జరిగిన వేళ త్రిషతో కలిసి కొన్ని కాంబినేషన్ సీన్లలో నటించాను. అప్పుడే తనతో పరిచయం ఏర్పడింది. ఎంతో బాగా చూసుకున్నారు. ప్రతి విషయంలోనూ నన్ను భాగం చేసేవారు. పరిశ్రమలో చాలా మంది ఎవరి పని వారు చేసుకొని వెళ్లిపోతారు. కానీ, త్రిష కొత్తవారిపై కూడా ఆదరణ చూపిస్తారు. చాలా తక్కువ మంది మాత్రమే అలా చేయగలరు''. ''ఆ తర్వాత విజయ్‌కు జోడీగా నాకు 'మాస్టర్' సినిమాలో అవకాశం వచ్చినప్పుడు త్రిష స్పెషల్ మెసేజ్ పంపారు. 'బేబీ నీకు ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. అలా అభినందించడానికి పెద్ద మనసు కావాలి'' అంటూ త్రిషపై మాళవిక ప్రశంసలు కురిపించారు. కెరీర్ కీలక మలుపు తిరిగే సమయంలోనూ త్రిష ఇచ్చిన ప్రోత్సాహం తనకెంతో ప్రత్యేకమని అన్నారు. 2021లో విడుదలైన 'మాస్టర్' విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఇక మాళవిక నటించిన తాజా చిత్రం 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది





# వైష్ణవి చైతన్య 'ఎపిక్' విశేషాలు!

'బేబీ' తర్వాత ఆనంద్, నేను ఛాలెంజింగ్‌గా తీసుకొని 'ఎపిక్' చేశాం. ఈ సినిమా చూస్తున్నప్పుడు 'బేబీ' గుర్తుకురాకపోతే మేము విజయం సాధించినట్టే. ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం నాకు మొదటి నుంచి ఉంది' అన్నారు తెలుగు బ్యూటీ వైష్ణవి చైతన్య. బ్లాక్ బస్టర్ 'బేబీ' జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. '90s' వెబ్ సిరీస్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా వైష్ణవి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..

- మనం ఎన్నో లవ్ స్టోరీలు చూసుంటాం. కానీ, ప్రతి లవ్ స్టోరీలోనూ ఏదోక ప్రత్యేకత ఉంటుంది. ఎపిక్ లో కూడా ఆ ప్రత్యేకత ఉంది. భిన్న దారులు, భిన్న మనస్తత్వాలు ఉన్న ఇద్దరు యూకేకి చదువుకోవడానికి వెళ్లి, అక్కడ కలుస్తారు. లివ్ ఇన్ లో ఉంటారు. ఆ ఇద్దరు ప్రైవేట్ గా మాట్లాడుకునే మాటలు ఏవైతే ఉంటాయో, ఆ సంభాషణల మీద నడిచే సినిమా. అమ్మాయి జీవితాన్ని ఒకలా చూస్తుంది. అబ్బాయి ఒకలా చూస్తాడు. అసలు వీరిద్దరూ ఎలా కలిశారు? వీరిద్దరి ఆలోచనలు ఏంటి? అనేది కొత్తదనాన్ని తీసుకొస్తుంది. ఈ సినిమాలో హంగామా ఉండదు. హత్తుకునేలా ఉంటుంది.
- ఇందులో ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర సాఫ్ట్ గా, కామ్ గా ఉంటుంది. జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఆదిత్య ఏం నేర్చుకున్నాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. నేను పోషించిన కడలి పాత్ర స్ట్రాంగ్ అమ్మాయి. తన కోసం తాను నిలబడే అమ్మాయి. క్లారిటీ ఉన్న అమ్మాయి.
- కడలి పాత్ర ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. కానీ, కుటుంబం వల్లనో, సమాజం వల్లనో మనలోని ఆ వెర్షన్ లోపలే ఉండిపోతుంది. బయటకు రాదు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఏదోక సమయంలో వారి కోసం వారు నిలబడాలి. అందుకే కడలి పాత్ర నా మనసుకు బాగా దగ్గరైంది.
- కథలోనూ, నా పాత్రలోనూ కొత్తదనం ఉండాలి. ఆ పాత్రలో నన్ను నేను చూసుకోగలగాలి. ఎపిక్ ఎంచుకోవడానికి కారణమదే.
- దర్శకుడు ఆదిత్యతో కలిసి పని చేయడం చాలా సరదాగా ఉంటుంది. ఆయన జీవితాన్ని చాలా లోతుగా గమనిస్తుంటారు. జీవితంలో ఉన్న ప్రతి చిన్న విషయాన్ని గమనిస్తూ, అందులో ఉన్న ప్రాముఖ్యత గురించి మాట్లాడుతుంటారు. ఎపిక్ సినిమాలో కూడా అదే కనిపిస్తుంది. ఆదిత్య, కడలి పాత్రల మధ్య జరిగే చిన్న విషయాలకు ఎంత ఇంపార్టెన్స్ ఉందో చూపిస్తారు. ఆదిత్య యూనిక్ డైరెక్టర్. నాకు బాగా ఇష్టమైన దర్శకులలో ఆయన ఒకరు.
- నేను ఏదైనా విషయం బయట మాట్లాడాలంటే కాస్త భయపడుతుంటాను. కడలి పాత్ర ద్వారా నేనొక విషయం నేర్చుకున్నాను. ముందు మనల్ని మనం నమ్మాలి, కాన్ఫిడెంట్ గా ఉండాలి.
- అమ్మాయిలు ఇండిపెండెంట్ గా ఉన్న సినిమాలు ఇప్పటికే చాలా ఉన్నాయి. అయితే ఈ సినిమాలో ప్రత్యేకత ఏంటంటే.. ఒక సముద్రం లాంటి అమ్మాయి, తన జీవితంలో ఉన్న సమస్యను డీల్ చేస్తూ.. తన జీవితాన్ని ఎలా ముందుకు నడిపించింది అనేది ఉంటుంది. ఈ పాత్ర ద్వారా మంచి సందేశం కూడా ఉంటుంది.
- ఈ సినిమాలో లివ్ ఇన్ రిలేషన్‌షిప్ గురించి మాట్లాడతాం కాబట్టి, 90s వెబ్ సిరీస్ అంత క్లీన్ ఎంటర్టైనర్ లా ఉండకపోవచ్చు. కానీ, దర్శకుడు ఆదిత్య ఈ సినిమాకి ఏది అవసరమో అది చూపిస్తూనే, ఫ్యామిలీ ఆడియన్స్ ని కూడా దృష్టిలో ఉంచుకొని ఎంతవరకు చూపించాలో అంతవరకు చూపించారు. ఇబ్బందికర సన్నివేశాలు ఉండవు. ఫ్యామిలీ ఆడియన్స్ సినిమా చూడొచ్చు.



# యశ్‌తో మిస్సైన అడ్వెంచర్ ప్రాజెక్ట్!

యశ్‌కు ఇండియానా జోన్స్ లాంటి అడ్వెంచర్ కథ వినిపించానని.. కానీ, అది పట్టాలెక్కలేదని దర్శకుడు పీఎస్ మిత్రన్ తెలిపారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో.. యశ్‌కు వినిపించిన కథ గురించి పంచుకున్నారు. ''యశ్‌కు నేను ప్రతిష్ఠాత్మక కథ వినిపించా. చాలా బలమైన ఎమోషన్స్ ఉన్నాయి. ఇండియానా జోన్స్ లాంటి అడ్వెంచర్ స్టోరీ. నా డ్రీమ్ ప్రాజెక్ట్. అది రూపొందించి ఉంటే చాలా అద్భుతంగా ఉండేది. కానీ, అప్పుడు యశ్‌కు సమయంలేక దాన్ని వదులుకున్నారు. దీంతో అది నెరేషన్ దగ్గరే ఆగిపోయింది'' అని చెప్పారు. అడల్ట్ కంటెంట్‌తో కూడిన ఎమోషన్స్‌లేని గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో నటించడం కంటే.. భావోద్వేగాలు ఎక్కువగా ఉన్న అడ్వెంచర్ సినిమా ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేదని పీఎస్ మిత్రన్ అభిప్రాయపడ్డారు.

**యశ్ టాక్సిక్.. ఓటీటీ డీల్‌లోనూ నిరాశే..**

ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన 'టాక్సిక్' అభిమానులను నిరాశ పర్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ డీల్‌పై రకరకాల వార్తలు వస్తున్నాయి. గతంలో ఈ సినిమా రైట్స్‌ను రూ.150కోట్లకు దక్కించుకొనేందుకు ప్రయత్నించిన ఓ సంస్థ ఇప్పుడు రూ.30కోట్లు మాత్రమే ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం (Toxic OTT). సినిమా భారీ హిట్ అవుతుందని భావించిన చిత్రబృందం రూ.150కోట్ల డీల్‌ను అప్పుడు ఓకే చేయలేదని.. రూ.200కోట్లు డిమాండ్ చేసిందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# హిట్ కోసం రూట్ మార్చిన స్టార్ కిడ్ శనయా కపూర్..

బాలీవుడ్ గ్లామర్ బ్యూటీ శనయా కపూర్ హిందీలో చేసిన మొదటి రెండు సినిమాలు బాక్సాఫీస్ దగ్గర ఆశించిన విజయాలను అందించలేకపోయాయి. అయినప్పటికీ తన హాట్ అందాలతో సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. అయితే సిల్వర్ స్క్రీన్ మీద సరైన బ్రేక్ రాకపోయినప్పటికీ, ఈ స్టార్ కిడ్ ఇప్పుడు హిట్ కోసం ఓటీటీ ద్వారా డిజిటల్ ఎంట్రీకి సిద్ధమైనట్లు పలు పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ ప్రొడ్యూస్ చేస్తున్న 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 3' వెబ్ సిరీస్‌లో శనయా కపూర్ లీడ్ రోల్ ప్లే చేసే ఆఫర్ దక్కించుకున్నట్లు సమాచారం. డైరెక్టర్ రీమా మాయ తెరకెక్కించనున్న ఈ గ్రాండ్ ప్రాజెక్ట్‌ను ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందిస్తున్నారు.

గతంలో కరణ్ డైరెక్షన్‌లో వచ్చిన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రం ఎంతటి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిందో అందరికీ తెలిసిందే. ఆలియా భట్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రాల కెరీర్‌కు ఆ సినిమా బిగ్ టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఆ తర్వాత వచ్చిన సీక్వెల్ 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' కూడా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసింది. ఆ సినిమా ద్వారానే అనన్య పాండే, తారా సుతారియా హీరోయిన్లుగా ఎంట్రీ ఇచ్చి క్రేజ్ తెచ్చుకున్నారు. ఇప్పుడు ఇదే సక్సెస్ ఫుల్ బ్రాండ్ నుండి వస్తున్న 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 3' వెబ్ సిరీస్ ద్వారా శనయా కపూర్ డిజిటల్ వరల్డ్‌లోకి అడుగుపెడుతుండటం ఆసక్తి రేపుతోంది. మరి ఈ పాపులర్ ఫ్రాంచైజీతో శనయా కపూర్ తన కెరీర్‌లో ఆశించిన బిగ్ సక్సెస్ అందుకుంటుందో లేదో చూడాలి.



# ఏపీలో చిరంజీవి కూమార్తెకు కీలక పదవి!

మెగాస్టార్ చిరంజీవి పెద్ద కూతురు, ఫ్యాషన్ డిజైనర్, సినీ నిర్మాత కొణిదెల సుస్మితకు ఆంధ్రప్రదేశ్‌లో పదవి దక్కింది. విజయవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రి దేవస్థానం ట్రస్ట్ బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితురాలిగా ఆమె నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యదర్శి కన్నబాబు అధికారికంగా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు చేయడం, ప్రత్యేక ఉత్సవాల నిర్వహణలో భాగస్వామ్యం కావడం వంటి అంశాల్లో సుస్మిత కొణిదెల తన సేవలను అందించనున్నారు. ఇదిలా ఉంటే.. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇప్పటికే మెగా కుటుంబానికి ఓ పదవిని ఇచ్చింది. తెలంగాణలోని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా చిరంజీవి సతీమణి సురేఖను నియమించిన సంగతి తెలిసిందే. ఇక సుస్మిత విషయానికొస్తే.. ఫ్యాషన్ డిజైనర్‌గా కెరీర్‌ని ప్రారంభించిన ఆమె.. ప్రస్తుతం సినీ నిర్మాతగా రాణిస్తున్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి.. వరుస సినిమాలు నిర్మిస్తున్నారు. తన తండ్రి చిరంజీవిని హీరోగా పెట్టి ఆమె నిర్మించిన చిత్రం 'మన శంకర వర ప్రసాద్ గారు' ఈ సంక్రాంతికి విడుదలై విజయాన్ని అందుకుంది.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com